**2023 ఫిబ్రవరి, 6వ తేదీన తెలంగాణ రాష్ట్ర శాసనసభకు**

**2023-24 వార్షిక బడ్జెట్ సమర్పిస్తూ..**

**గౌరవనీయులు, ఆర్థిక శాఖామాత్యులు**

**శ్రీ తన్నీరు హరీశ్ రావు గారి ప్రసంగం**

**గౌరవ అధ్యక్షా.. !**

1. గౌరవ ముఖ్యమంత్రి శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు గారి సారథ్యంలో తెలంగాణ రాష్ట్రం ఎనిమిదిన్నరేండ్ల స్వల్పకాలంలోనే అత్యంత ప్రగతిశీల రాష్ట్రంగా రూపుదిద్దుకున్నది. ప్రజాసంక్షేమంలోనూ అభివృద్ధిలోనూ యావత్ దేశానికి ఆదర్శప్రాయంగా నిలిచింది. “తెలంగాణ ఆచరిస్తుంది దేశం అనుసరిస్తుంది” అని చెప్పుకునే స్థాయికి చేరుకున్నది. ఇది రాష్ట్ర ప్రజలందరికీ గర్వకారణం.

2. మానవీయమైన దృక్పథం, నిర్మాణాత్మకమైన ఆలోచన, దార్శనికమైన ప్రణాళికా రచన, పారదర్శకమైన పరిపాలన వీటన్నిటి మేలు కలయిక అయిన “తెలంగాణ మోడల్” నేడు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మన్ననలు పొందుతున్నది.

3. ఆర్థిక మాంద్యం, కరోనా వంటి సంక్షోభాలు ఎదురైనప్పటికీ తట్టుకొని తెలంగాణ బలీయమైన ఆర్థిక శక్తిగా నిలబడగలిగింది.

సంక్షోభ సమయాలలోనూ సమర్థవంతమైన ఆర్థిక నిర్వహణ చేస్తూ ప్రజా సంక్షేమ పథకాలను భారీ ఎత్తున నిరాటంకంగా అమలు చేయగలగటం తెలంగాణ ప్రభుత్వానికి మాత్రమే సాధ్యమైంది.

4. రాష్ట్రంలోని అన్ని సామాజికవర్గాల ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా, గ్రామీణ, పట్టణ, నగర ప్రాంతాలకు సమ ప్రాధాన్యతనిస్తూ సమగ్రాభివృద్ధిని సాధిస్తూ ముందుకు సాగుతున్నాం. అప్రతిహతంగా కొనసాగుతున్న తెలంగాణ ప్రగతి ప్రస్థానంలో భాగంగా 2023- 24 ఆర్థిక సంవత్సర వార్షిక బడ్జెట్ ను ప్రవేశపెడుతున్నాను. నాకు ఈ సదవకాశం కల్పించిన గౌరవ ముఖ్యమంత్రి గారికి హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.

**ఆర్థిక వృద్ధి**

5. తెలంగాణ ఏర్పడే నాటికి రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దయనీయంగా ఉండేది. రాష్ట్ర ఏర్పాటుకు ముందు రెండేళ్లలో జీఎస్డీపీ వార్షిక వృద్ధి రేటు 12 శాతం మాత్రమే. ఇది జాతీయ వృద్ధి రేటు అయిన 13.4 శాతం కంటే తక్కువ. రాష్ట్రం ఆవిర్భవించిన తరువాత గౌరవ ముఖ్యమంత్రి కేసీఆర్ గారు పటుతరమైన ఆర్థిక క్రమశిక్షణతో, పటిష్ఠమైన కార్యాచరణ చేపట్టడం వల్ల జీఎస్డీపీ క్రమేణా పెరుగుతూ వచ్చింది. ప్రభుత్వ ఆదాయాన్ని అత్యధికంగా పెట్టుబడి వ్యయానికి

వినియోగించటం, అభివృద్ధికి, సంక్షేమానికి సమ ప్రాధాన్యమివ్వడంతో సమ్మిళిత అభివృద్ధి సాకారమవుతున్నది. ఈ అభివృద్ధి మోడల్ గురించి ఊరువాడ, ప్రతీ రాష్ట్రంలోను విశేషంగా చర్చ జరుగుతున్నది. తెలంగాణ మోడల్ అభివృద్ధి యావత్ దేశంలోను రావాలని ప్రజలు కోరుకుంటున్నారు.

6. 2014-15 నుంచి 2019-20 వరకు రాష్ట్ర వార్షిక జీఎస్డీపీ వృద్ధి రేటు 13.2 శాతానికి పెరిగింది. ఇదే సమయంలో దేశ జీడీపీ వృద్ధి రేటు 10.2 శాతానికి తగ్గింది. కరోనా వల్ల ఏర్పడిన సంక్షోభం ప్రపంచ ఆర్థిక వ్యవస్థను కుదిపేసింది. ఈ సంక్షోభం నుంచి తెలంగాణ ఆర్థిక వ్యవస్థ అనతికాలంలోనే బయటపడి, సుస్థిరంగా ముందుకు సాగుతున్నది.

**అభివృద్ధి పథంలో తెలంగాణ**

7. 2017-18 నుంచి 2021-22 సంవత్సరాల మధ్యన దక్షిణాది రాష్ట్రాల్లో తెలంగాణ అత్యధిక తలసరి ఆదాయం వృద్ధి రేటు 11.8 శాతం నమోదు చేసి రికార్డు సృష్టించింది. దేశంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రం తెలంగాణ అని నీతి ఆయోగ్ నివేదికలో పేర్కొన్నది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటి నుండి ప్రతీ సంవత్సరం రాష్ట్ర జిఎస్డీపి (GSDP) వృద్ధి రేటు, దేశ వృద్ధి రేటు కంటే ఎక్కువ నమోదు అవుతుంది.

8. 2014-15 సంవత్సరంలో దేశ జిడిపిలో రాష్ట్ర వాటా 4.1 శాతం ఉండగా, 2020-21 నాటికి 4.9 శాతానికి పెరిగింది. దేశ జనాభాలో కేవలం 2.9 శాతం మాత్రమే తెలంగాణలో ఉండగా, దేశ జిడిపిలో తెలంగాణ భాగస్వామ్యం 4.9 శాతం కావడం మనందరికీ గర్వకారణం. దేశంలోని 18 ప్రధాన రాష్ట్రాలతో పోల్చితే, తెలంగాణ మెరుగైన వృద్ధి రేటును సాధిస్తున్నది. 2015-16 నుండి 2021-22 వరకు 12.6 శాతం జిఎస్డీపి సగటు వార్షిక వృద్ధిరేటుతో, తెలంగాణ 3వ స్థానంలో ఉంది.

9. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత ప్రధాన రంగాల్లోనూ, ఉప రంగాల్లోనూ గణనీయమైన వృద్ధి రేటు సాధిస్తున్నది. ఉదాహరణకు వ్యవసాయం, దాని అనుబంధ రంగాల్లో వచ్చిన అభివృద్ధితో మత్స్య సంపద, పశు సంపద భారీగా పెరిగింది. చేపల ఉత్పత్తి ప్రతికూల వృద్ధిరేటు నుండి రెండంకెల వృద్ధిరేటుకు చేరుకుంది. ఇది రాష్ట్రం చేపట్టిన నీటిపారుదల ప్రాజెక్టుల వల్ల సాధ్యమయింది. ఇదేవిధంగా ద్వితీయ, మరియు తృతీయ రంగంలోని ఐటీ, వాణిజ్యం, విద్యుత్తు, రవాణా, హోటళ్లు తదితర సేవారంగాల్లో అధిక వృద్ధి రేటు నమోదవుతున్నది. ప్రపంచవ్యాప్తంగా ఆర్థికమాంద్యం ఏర్పడినా, దాని ప్రభావం తెలంగాణ రాష్ట్రంపై అంతగా లేదు. రాష్ట్రంలో వినియోగంతో

పాటు, అన్ని రంగాల్లో పెట్టుబడులు పెరగడం వల్లనే ఇది సాధ్యమవుతున్నది.

**తలసరి ఆదాయం**

10. రాష్ట్రం సాధించిన ఆర్థికవృద్ధికి మరో కొలమానం తలసరి ఆదాయం.2013-14 సంవత్సరంలో 1,12,162 రూపాయలు ఉన్న రాష్ట్ర తలసరి ఆదాయం, 2022-23లో 3,17,115 రూపాయలు ఉండవచ్చని అంచనా. ఇది జాతీయ సగటు అయిన 1,70,620 రూపాయల కంటే 86 శాతం ఎక్కువ. జాతీయ తలసరి ఆదాయంకన్నా, తెలంగాణ తలసరి ఆదాయం 1,46,495 రూపాయలు ఎక్కువగా ఉంది. ఇది తెలంగాణ రాష్ట్రం సాధించిన అపూర్వమైన ప్రగతికి నిదర్శనం.

**ఆర్థిక వృద్ధికి ఆటంకాలు కల్పిస్తున్న కేంద్రం:**

11. ఒకవైపు రాష్ట్రం వేగంగా అభివృద్ధి చెందుతుంటే, కేంద్ర ప్రభుత్వం అడ్డంకుల మీద అడ్డంకులు సృష్టిస్తున్నది., సాగునీటి ప్రాజెక్టులను సత్వరంగా పూర్తి చేయడం కోసం తెలంగాణ ప్రభుత్వం ఎఫ్.ఆర్.బీ.ఎం పరిధికి లోబడి బడ్జెటేతర రుణాలు సమీకరించింది.

12. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి మనకున్న ఆర్థిక సామర్థ్యం మేరకు రుణ పరిమితిని 53,970 కోట్లుగా బడ్జెట్ లో పొందుపరిచి, ఈ

సభలో ఆమోదించుకొన్నాం. కానీ కేంద్ర ప్రభుత్వం ఏకపక్షంగా 15,033 కోట్లు కోత పెట్టి ఈ పరిమితిని 38,937 కోట్లకు తగ్గించింది. ఈ నిర్ణయం పూర్తిగా అసంబద్ధమైనది.

13. కేంద్ర ప్రభుత్వం ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధంగా ఈ తరహాలో పెడుతున్న ఆంక్షలు, తీసుకుంటున్న నిర్ణయాలు రాష్ట్రాల హక్కులను కాలరాస్తున్నాయి.

14. ప్రస్తుతం అధికారంలో ఉన్న కేంద్రప్రభుత్వం ఆర్థికసంఘం చేసే సిఫారసులను యథాతథంగా అమలుపరిచే సత్సంప్రదాయానికి తిలోదకాలిచ్చింది. పన్నుల వాటాలో తెలంగాణకు 2019-20 సంవత్సరంలో ఇచ్చిన మొత్తానికి తగ్గకుండా 723 కోట్లు స్పెషల్ గ్రాంట్ ఇవ్వాలని, పోషకాహార కార్యక్రమాల కోసం 171కోట్లు గ్రాంటు ఇవ్వాలని 15వ ఆర్థిక సంఘం చెప్పినప్పటికీ కేంద్రం ఇవ్వకుండా మొండి చెయ్యి చూపింది. 2021-26 సంవత్సరాలకు గానూ 15వ ఆర్థిక సంఘం తెలంగాణ రాష్ట్రానికి 5,374 కోట్లు గ్రాంటుగా ఇవ్వాలని సిఫారసు చేస్తే ఇవి కూడా ఇవ్వకుండా కేంద్రం తెలంగాణకు తీవ్రమైన అన్యాయం చేసింది. దేశ చరిత్రలో ఏ ప్రభుత్వమూ ఈ విధంగా ఆర్థిక సంఘం సిఫార్సులను బేఖాతరు చేయలేదు.

15. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం లోని 94(1) సెక్షన్ ప్రకారం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రెండు రాష్ట్రాల్లోనూ కేంద్ర పన్నులలో రాయితీలు ప్రకటించి తద్వారా ఆర్థిక, పారిశ్రామిక, అభివృద్ధి కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. కానీ కేంద్ర ప్రభుత్వం నామమాత్రపు రాయితీలతో ఉభయ రాష్ట్రాల ప్రయోజనాలనూ దెబ్బతీసింది.

16. విభజన చట్టంలోని 94(2) సెక్షన్ ప్రకారం వెనుకబడిన జిల్లాల అభివృద్ధికోసం కేంద్రం నిధులు కేటాయించాలి. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం ఏడాదికి 450 కోట్లు చొప్పున తెలంగాణకు ఇవ్వాల్సి ఉండగా మూడు సంవత్సరాలకు సంబంధించి 1,350 కోట్లు ఇవ్వనేలేదు .

17. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన మిషన్ భగీరథ పథకానికి 19,205 కోట్లు, మిషన్ కాకతీయ పథకానికి 5,000 కోట్లు ఇవ్వాలని నీతి ఆయోగ్ కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేసింది. కానీ కేంద్ర సర్కారు ఒక్క పైసా కూడా ఇవ్వలేదు.

18. రాష్ట్రంలో పదేండ్ల పాటు సుస్థిర అభివృద్ధికోసం అవసరమైన చర్యలు తీసుకోవాలని పునర్వ్యవస్థీకరణ చట్టంలోని 13వ షెడ్యూల్ కేంద్ర ప్రభుత్వాన్ని నిర్దేశించింది. కానీ చాలా అంశాలను

పరిష్కరించకుండా కేంద్ర ప్రభుత్వం నిష్క్రియాపరత్వాన్ని ప్రదర్శిస్తున్నది.

19. రాష్ట్రంలో కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం స్టీల్ ప్లాంట్ , గిరిజన యూనివర్సిటీని స్థాపించాలని పునర్వ్యవస్థీకరణ చట్టం స్పష్టంగా పేర్కొన్నది. ఎనిమిదిన్నరేండ్లయినా ఈ హామీలు నెరవేరలేదు. పైగా మంజూరైన ఐ టీ ఐ ఆర్ ప్రాజెక్టును రాష్ట్రానికి రాకుండా చేసింది.

20. నదీజలాల చట్టం సెక్షన్ 3 ను అనుసరించి నూతన రాష్ట్రమైన తెలంగాణకు రావాల్సిన కృష్ణా జలాల వాటా ను నిర్ణయించాలని బ్రజేష్ కుమార్ ట్రిబ్యునల్ కు కేంద్రం సూచించవలసి ఉంది. కానీ కేంద్రం చేస్తున్న అకారణమైన కాలయాపన వల్ల రాష్ట్ర ప్రయోజనాలకు తీవ్ర విఘాతం కలుగుతున్నది. ముఖ్యంగా తెలంగాణ ప్రభుత్వం కృష్ణా నదిపై తలపెట్టిన పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల పథకం , డిండి వంటి ప్రాజెక్టుల నిర్మాణానికి ఆటంకం కలుగుతున్నది. ట్రిబ్యూనల్ తీర్పుల పేరిట దశాబ్దాల తరబడి జరుగుతున్న అర్థం పర్థం లేని కాలయాపనను తెలంగాణ ప్రభుత్వం తీవ్రంగా నిరసిస్తున్నది.

21. 2022 ఆగస్టులో కేంద్ర విద్యుత్ శాఖ బకాయిల చెల్లింపు పేరిట ఇచ్చిన ఉత్తర్వు తెలంగాణ పట్ల కేంద్రం ప్రదర్శిస్తున్న వివక్షకు మరో

నిదర్శనం. విద్యుత్తు సరఫరాకు సంబంధించి 3,441.78 కోట్లను అసలు కింద, 3,315.14 కోట్లను వడ్డీ కింద లెక్క వేసి మొత్తంగా 6,756.92 కోట్లను తెలంగాణ డిస్కంలు ఏపీ జెన్ కోకు 30 రోజుల్లోగా చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్ర విద్యుత్తు శాఖ ఆదేశాలిచ్చింది.

22. విద్యుత్తు వినియోగానికి సంబంధించి ఆంధ్రప్రదేశ్ నుంచి మన రాష్ట్రానికి రావాల్సిన 17,828 కోట్ల బకాయిలు ఇప్పించాలని కేంద్ర ప్రభుత్వానికి, కేంద్ర హోంమంత్రిత్వ శాఖకు పలుమార్లు విజ్ఞప్తులు చేసినప్పటికీ కేంద్రం పట్టించుకోవడంలేదు. చివరకు కోర్టును ఆశ్రయించడం తప్ప తెలంగాణకు మరో మార్గం లేకపోయింది.

23. 2014-15 రాష్ట్రం ఏర్పడిన కొత్తలో కేంద్ర పథకాల కింద ఇవ్వాల్సిన 495 కోట్ల రూపాయలను కేంద్ర మంత్రిత్వ శాఖలు బాధ్యతా రహితంగా ఆంధ్రప్రదేశ్ కు బదిలీ చేశాయి. ఉద్దేశ్య పూర్వకంగానో లేక పొరపాటుననో జరిగిన ఈ అన్యాయాన్ని సవరించమని తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న విజ్ఞప్తులను కేంద్రం పెడచెవిన పెడుతున్నది. ఆంధ్రప్రదేశ్ ఖాతాలో వేసిన నిధులను తెలంగాణకు తిరిగి సర్దుబాటు చేయడంలో కేంద్రం నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నది. సాక్షాత్తు పార్లమెంటు ఆమోదించిన పునర్వ్యవస్థీకరణ చట్టంలో పేర్కొన్న అనేక అంశాలను కేంద్ర ప్రభుత్వం అమలు చేయకపోవడం పూర్తిగా అప్రజాస్వామికం.

24. కేంద్రం సహకారం లేకపోయినా, గత ఎనిమిదిన్నరేండ్లలో తెలంగాణ రాష్ట్రం సాధించిన గణనీయమైన ప్రగతి వివరాలను సంక్షిప్తంగా సభ ముందుంచుతున్నాను.

**వ్యవసాయ రంగం**

25. ప్రాథమిక రంగమైన వ్యవసాయ అభివృద్ధియే, ఇతర రంగాల అభివృద్ధికి ఆధారభూతంగా నిలుస్తుంది. సుసంపన్నమైన వ్యవసాయానికి ప్రతీకగా తెలంగాణా నేడు దేశానికి దిశా నిర్దేశనం చేస్తున్నది. తెలంగాణలో అమలవుతున్న విధంగా రైతు సంక్షేమ విధానాలు తమ రాష్ట్రాలలోనూ అమలు చేయాలని రైతులు ఆయా రాష్ట్ర ప్రభుత్వాల మీద ఒత్తిడి తెస్తున్నారు.

26. ఒకప్పుడు సంక్షోభంలో కూరుకొని అల్లాడిన తెలంగాణ వ్యవసాయానికి తిరిగి జవజీవాలను అందించడంలోనూ, నిరాశ నిస్పృహలతో కొట్టుమిట్టాడే రైతుల్లో తిరిగి ధైర్యాన్నీ, ఆత్మవిశ్వాసాన్ని నింపడంలోనూ ప్రభుత్వం పూర్తిగా సఫలీకృతమైంది. ప్రభుత్వం చేసిన అసాధారణ కృషితో నాడు కరువుకాటకాలతో అలమటించిన తెలంగాణ నేడు సుజల, సుఫల, సస్యశ్యామల తెలంగాణగా అవతరించింది. అపూర్వమైన, అద్భుతమైన ఈ పరివర్తనకు ముఖ్యమంత్రి కేసీఆర్ గారే కర్త, కర్మ, క్రియగా నిలిచారు. అందుకే రాష్ట్రంలోని కర్షక సోదరులు

వారిని రైతు బాంధవుడిగా భావిస్తున్నారు. నిండు హృదయంతో ఆశీర్వదిస్తున్నారు.

27. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుకు ముందు పదేండ్లలో వ్యవసాయం, వ్యవసాయ అనుబంధాల రంగాలకు అప్పటి ప్రభుత్వాలు కేవలం 7,994 కోట్ల నిధులు ఖర్చు చేయగా, రాష్ట్రం ఆవిర్భవించినప్పటినుంచి 2023 జనవరి వరకు తెలంగాణ ప్రభుత్వం 1 లక్షా 91 వేల 612 కోట్ల రూపాయలు, అంటే 20 రెట్లు నిధులు అధికంగా ఖర్చు చేసింది.

28. నిలువెల్లా రైతు స్వభావాన్ని నింపుకున్న రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ గారి పాలనలో రైతుల కళ్ళలో దీనత్వం తొలిగి, ధీరత్వం తొణికిసలాడుతున్నది.

29. గతంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా రైతు బంధు, రైతు బీమా, వ్యవసాయానికి 24 గంటలపాటు నిరంతరాయంగా నాణ్యమైన ఉచిత విద్యుత్తు, రైతురుణమాఫీ, చెరువుల పునరుద్ధరణ, పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయడం, భారీ ప్రాజెక్టుల నిర్మాణం, సకాలంలో ఎరువులు, విత్తనాల పంపిణీ, కల్తీ విత్తనాల నియంత్రణ, వ్యవసాయ విస్తారణాధికారుల నియామకం, రైతు వేదికలు, పంట కల్లాల నిర్మాణం, రైతు బంధు సమితుల ఏర్పాటు.. ఒకటా.. రెండా.. లెక్కకు మించిన అద్భుతమైన పథకాలను, సంస్కరణలను అమలులోకి

తీసుకొచ్చారు. దుక్కి దున్నింది మొదలుకొని పండిన ప్రతిగింజా కొనుగోలు చేసేదాకా అడుగడుగునా రైతన్నకు కొండంత అండగా ప్రభుత్వాన్ని నిలిపారు.

30. రైతన్నలకు చార్జీలు లేకుండా కరెంటును, పన్నులు లేకుండా సాగునీటినీ అందిస్తున్న ఒకే ఒక రాష్ట్రం మన తెలంగాణ రాష్ట్రం. ఈ అద్భుతమైన చర్యల పర్యవసానంగానే నేడు దేశ వ్యవసాయ వృద్ధిరేటు కంటే తెలంగాణ వ్యవసాయ వృద్ధి రేటు దాదాపు రెండు రెట్లు అధికంగా ఉంది.

31. దేశ వ్యవసాయ వృద్ధి రేటు 4 శాతం కాగా తెలంగాణ వ్యవసాయ వృద్ధి రేటు 7.4 శాతంగా ఉంది. ముఖ్యమంత్రి కేసీఆర్ గారి నేతృత్వంలో వ్యవసాయ అభివృద్ధిలో తెలంగాణ ప్రభుత్వం సాధించిన ఘనతకు ఇది నిదర్శనం.

32. 2014-15 తెలంగాణలో మొత్తం పంట సాగు విస్తీర్ణం 131.33 లక్షల ఎకరాలు కాగా, తెలంగాణ ప్రభుత్వం తీసుకొన్న వ్యవసాయ అభివృద్ధి చర్యల వల్ల సాగు విస్తీర్ణం 2020-21 నాటికి 215.37 లక్షల ఎకరాలకు చేరుకున్నది. రాష్ట్రంలో వరి ఉత్పత్తి మూడు రెట్లు పెరిగింది. 2014-15లో 68.17 లక్షల మెట్రిక్ టన్నుల నుంచి 2021-22లో

2 కోట్ల 2 లక్షల మెట్రిక్ టన్నులకు చేరుకొన్నది. ఇవాళ దేశానికే అన్నం పెట్టే అన్నపూర్ణగా తెలంగాణ అవతరించింది.

33. వ్యవసాయరంగంలో చేపట్టిన కొన్ని సంక్షేమ కార్యక్రమాల గురించి సంక్షిప్తంగా వివరిస్తాను.

**రైతుబంధు**

34. 75 సంవత్సరాల భారత దేశ చరిత్రలో 65 లక్షల మంది రైతులకు 65 వేలకోట్ల రూపాయల భారీ మొత్తాన్ని పంట పెట్టుబడి సాయం కింద అందించిన ఒకే ఒక ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వం.

35. గౌరవ ముఖ్యమంత్రివర్యులు కేసీఆర్ గారి ఆలోచనల వెలుగులో ఆవిష్కృతమైన "రైతుబంధు" పథకం ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు పొందింది. ఒకప్పుడు రుణాల ఊబిలో చిక్కి ఆత్మహత్యలకు ఒడిగట్టిన రైతుల హృదయాల్లో ఆశాదీపాలను వెలిగించింది. భరోసాను నింపింది. వారి కన్నీరు తుడిచి కడగండ్లు తీర్చింది. డబ్బులు తమ ఖాతాల్లో జమ అయినట్టు తెలియజేస్తూ ఫోన్ కు మెసేజ్ రాగానే వచ్చే టింగు టింగు శబ్దం వినగానే రైతుల ముఖాలు ప్రకాశిస్తున్నాయి.

36. మోటార్లకు మీటర్లు పెట్టడంలేదని కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి ఇవ్వాల్సిన నిధుల్లో కోత పెట్టినా, ఏకపక్షంగా ఎఫ్.ఆర్.బి.ఎం నిధులను తగ్గించినా, కరోనా లాంటి కష్టకాలమొచ్చినా రైతాంగానికి

మాత్రం పది పంటకాలాలకు రైతుబంధు పంటపెట్టుబడి సహాయాన్ని ప్రభుత్వం సమయానికి అందించింది. ముఖ్యమంత్రి కేసీఆర్ గారికి రైతుల పట్ల ఉన్న ప్రేమకు ఇది ప్రబల నిదర్శనం.

37. రైతుబీమా పథకం రైతుల కుటుంబాలకు ఎనలేని ధీమానిస్తున్నది. విధివశాత్తూ ఏ రైతైనా మరణిస్తే, మరణించిన నాటి నుండి 10 రోజులలోగా ఐదు లక్షల బీమా సొమ్మును ప్రభుత్వం అతని కుటుంబానికి అందజేస్తున్నది. ఇందుకోసం నయాపైసా భారం రైతులపై వేయకుండా ప్రీమియం మొత్తాన్ని వందశాతం ప్రభుత్వమే ఎల్ ఐ సీ సంస్థకు చెల్లిస్తున్నది. తెలంగాణ ప్రభుత్వం మాదిరిగా ఈ విధమైన రైతు బీమాను ప్రపంచంలో ఏ ప్రభుత్వం అందిస్తున్న దాఖలా లేదు. బీమా మొత్తం పొందడం కోసం రైతు కుటుంబం దఫ్తర్ కు పోవాల్సిన పనిలేదు, దరఖాస్తు ఇవ్వాల్సిన పని లేదు. మధ్యవర్తుల ప్రమేయం అస్సలు లేదు. ఇప్పటివరకు దాదాపు లక్షమంది రైతుల కుటుంబాలకు 5,384 కోట్ల ఆర్థిక సహాయం రైతుబీమా ద్వారా అందించడం జరిగింది.

38. గత ఎనిమిదిన్నరేండ్లుగా రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజనూ ప్రభుత్వం కొనుగోలు చేసింది. 2014-15లో 24లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించగా 2022-23లో ఇప్పటివరకు 65 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించింది. కొవిడ్ సంక్షోభం తీవ్రంగా

ఉన్న 2020-21 లో కూడా ప్రభుత్వం రైతులకు ఇబ్బంది రాకుండా 141.04 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించింది.

39. గత యాసంగిలో పండిన వరి ధాన్యం కొనుగోలు చేయకుండా కేంద్ర ప్రభుత్వం ఉద్దేశ్యపూర్వకంగా సమస్యను సృష్టించింది. యాసంగి వడ్లలో నూకల శాతం అధికం అనే నెపంతో కొనుగోలు చేయలేదు. పైగా తెలంగాణ ప్రజలు నూకలు బుక్కడం అలవాటు చేసుకోవాలని కేంద్రమంత్రి చేసిన వ్యాఖ్యలు తెలంగాణ ప్రజల హృదయాలను తీవ్రంగా గాయపరిచాయి. కేంద్రం చేతులెత్తేసినా, రాష్ట్ర రైతుల ప్రయోజనాలు కాపాడటమే విద్యుక్త ధర్మంగా భావించిన ముఖ్యమంత్రి గారు, ఆర్థిక భారాన్ని లెక్కచేయకుండా పండిన పంటనంతా కొనుగోలు చేసిన విషయాన్ని గుర్తుచేస్తున్నాను.

**ఆయిల్ పామ్ సాగుకు ప్రోత్సాహం**

40. తెలంగాణ ప్రభుత్వం పెద్ద ఎత్తున ప్రాజెక్టులను నిర్మించడం, చెరువులను బాగుచేయడం, చెక్ డ్యాంలను నిర్మించడం వల్ల గాలిలో తేమశాతం పెరిగింది. అందువల్ల రాష్ట్రంలో ఆయిల్ పామ్ సాగుకు అనుకూలత ఏర్పడింది. నేడు దేశం పామాయిల్ ను పెద్ద ఎత్తున విదేశాల నుండి దిగుమతి చేసుకొంటున్నది. ఆయిల్ పామ్ కు మార్కెట్లో మంచి డిమాండ్ ఉంది. పామాయిల్ సాగు ద్వారా రైతులకు

ప్రతి ఎకరానికి దాదాపు లక్షా 50వేల రూపాయల వరకు నికర ఆదాయం వస్తుంది. దీన్ని దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర ప్రభుత్వం ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణాన్ని 20 లక్షల ఎకరాలకు పెంచాలనే లక్ష్యం పెట్టుకున్నది. ఆయిల్ పామ్ సాగుకు ప్రభుత్వం పెద్ద ఎత్తున ప్రోత్సాహకాలను అందిస్తున్నది. రైతులకు ఆయిల్ పామ్ మొక్కలు, ఎరువులు, డ్రిప్ ఇరిగేషన్ అన్నింటిపై ఇస్తున్న భారీ సబ్సిడీల కోసం బడ్జెట్లో ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తున్నది.

ఆయిల్ పామ్ సాగుకు బడ్జెట్ లో రూ.1,000 కోట్లు. ప్రతిపాదించడమైనది.

**రైతు వేదికలు**

41. వ్యవసాయ సంబంధమైన సాంకేతిక పరిజ్ఞానం ఇతర అంశాలపై రైతులు పరస్పరం చర్చించుకోవడానికి వీలుగా ప్రభుత్వం ప్రతీ ఐదువేల ఎకరాల క్లస్టర్ కు ఒక రైతు వేదికను అందుబాటులోకి తెచ్చింది. 572 కోట్ల వ్యయంతో 2601 రైతు వేదికలను నిర్మించింది.

వ్యవసాయశాఖకు బడ్జెట్ లో రూ.26,831 కోట్లు ప్రతిపాదించడమైనది.

**నీటిపారుదల రంగం**

42. వేసవిలో సైతం మత్తడి దుంకుతూ అలుగెల్లుతున్న చెరువులూ, ఎత్తిపోతల ప్రాజెక్టుల ద్వారా రిజర్వాయర్లకు చేరుతున్న నదీజలాలూ సాగునీటి రంగంలో తెలంగాణ సాధించిన అద్భుతాలను ఆవిష్కరిస్తున్నాయి.

43. సమైక్య రాష్ట్రంలో తెలంగాణకు సాగునీటి రంగంలో తీరని అన్యాయం జరిగింది. బాయిలు బోర్లే దిక్కయిపోయిన రైతాంగం అప్పుల బాధలతో ఆత్మహత్యల పాలయింది. పాడుబడిన ఇండ్లు, బీడుపడిన పొలాలతో తెలంగాణ బిక్కచచ్చిపోయింది. నేడు స్వరాష్ట్రంలో తెలంగాణ సాగునీటి రంగంలో స్వర్ణయుగాన్ని తలపిస్తున్నది. భారీ, మధ్యతరహా ప్రాజెక్టుల నిర్మాణంతో తెలంగాణ సస్యశ్యామల మాగాణంగా సాక్షాత్కరిస్తున్నది. అన్నపూర్ణగా అవతరించి, దేశానికే అన్నం పెడుతున్నది.

**మిషన్ కాకతీయ**

44. కాకతీయుల నుండి ఆసఫ్ జాహీలదాకా నిర్మించి, పరిరక్షించిన చెరువులు ఆధునిక ప్రజాస్వామ్య పాలకుల హయాంలో శిథిలమైపోయాయి. కేసీఆర్ గారు తెలంగాణ రాష్ట్ర సారథిగా పగ్గాలు చేపట్టిన వెనువెంటనే చెరువుల పునరుద్ధరణ కోసం మిషన్ కాకతీయ

పథకాన్ని ప్రవేశ పెట్టారు. ఈ పథకం గొప్ప ఫలితాలను ఇచ్చింది. చెరువులు బాగు పడటంతో నీటి నిల్వ సామర్థ్యం బాగా పెరిగింది. ప్రాజెక్టులతో అనుసంధానం చేయడంతో వేసవిలో సైతం చెరువులు జలకళను సంతరించుకుంటున్నాయి. భూగర్భ జల మట్టం పెరిగింది. 15 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ పొందింది.

45. కేంద్ర ప్రభుత్వ అమృత్ సరోవర్ పథకానికి మన మిషన్ కాకతీయనే ప్రేరణగా నిలిచింది. వివిధ రాష్ట్రాలు మిషన్ కాకతీయ తరహాలోనే చెరువుల పునరుద్ధరణకు పూనుకోవడం మనందరికీ గర్వకారణం.

46. కల్వకుర్తి, బీమా, నెట్టెంపాడు, కోయిల్ సాగర్, ఎల్లంపల్లి, మిడ్ మానేరు, దేవాదుల తదితర పెండింగ్ ప్రాజెక్టులను తెలంగాణ ప్రభుత్వం శరవేగంగా పూర్తిచేసింది. దీంతో 20 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టు అభివృద్ధి అయింది. కరవు పీడిత ప్రాంతంగా, వలసల జిల్లాగా పేరుపడ్డ ఉమ్మడి పాలమూరు జిల్లా నేడు పచ్చని పంటలకు నెలవయింది. పాలమూరులో దొరికే వ్యవసాయ పనులకోసం ఇతర రాష్ట్రాల రైతుకూలీలు వలసలు వస్తున్నారంటే పరిస్థితిలో వచ్చిన మార్పును అర్థం చేసుకోవచ్చు.

47. రాష్ట్ర ప్రభుత్వం 3,825 కోట్లతో 1200 చెక్ డ్యామ్ ల నిర్మాణం చేపట్టింది. వీటిలో మొదటి దశ 650 చెక్ డ్యాంల నిర్మాణం పూర్తయింది. మిగతా చెక్ డ్యాముల పనులు పురోగతిలో ఉన్నాయి.

48. ఉమ్మడి పాలమూరు, రంగారెడ్డి జిల్లాలను సంపూర్ణంగా సస్యశ్యామలం చేసేవిధంగా తెలంగాణ ప్రభుత్వం పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టును నిర్మిస్తున్నది. ఈ ప్రాజెక్టు నిర్మాణం దాదాపు 60 శాతం పూర్తయింది. ఈ దశలో కొన్ని ప్రతిపక్షశక్తులూ కుట్రపూరితంగా కేసులు వేస్తూ అడ్డుకొంటున్నాయి. త్వరలోనే పర్యావరణ అనుమతులను సాధించి శరవేగంగా ఈ ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేయడానికి ప్రభుత్వం కంకణబద్ధమై ఉన్నది.

49. ఉమ్మడి ఖమ్మం జిల్లాను సస్యశ్యామలం చేసే సీతారామ ప్రాజెక్టు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ ఆర్థిక సంవత్సరంలోనే సీతారామ ప్రాజెక్టును పూర్తిచేసి ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని కరువు పీడిత ప్రాంతాలకు నీళ్ళివ్వడంతోపాటూ, ఎన్.ఎస్.పీలో నీటి లభ్యత ఉండని సమయాల్లో ఆయకట్టును స్థిరీకరించడం కోసం పాలేరు రిజర్వాయర్ కు అనుసంధానం చేయడం జరుగుతుంది. ఈ అనుసంధానంతో ఖమ్మం జిల్లా రైతులు కాలం అయిందా లేదా అనే దిగులు లేకుండా రెండు పంటలను పక్కాగా పండించుకొనే అవకాశం కలుగుతుంది.

50. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం దేశ చరిత్రలోనే అపూర్వ ఘట్టం. ఈ బహుళ దశల భారీ ఎత్తిపోతల పథకాన్ని.. ముఖ్యమంత్రి గారి కార్యదక్షత వల్ల, నీటిపారుదల శాఖ ఉద్యోగుల నైపుణ్యం వల్ల, వేలాదిమంది కార్మికులు రాత్రింబగళ్లు చేసిన శ్రమ వల్ల మూడున్నర ఏళ్ల స్వల్పకాలంలోనే పూర్తిచేయగలిగాం.

51. నేడు రాష్ట్రంలో మొత్తంగా 73 లక్షల 33 వేల ఎకరాలకు సాగునీటి వసతి ఏర్పడింది. రానున్న రెండు మూడేళ్లలో మరో 50 లక్షల 24 వేల ఎకరాలకు సాగు నీరు అందుతుంది . కోటికి పైగా ఎకరాల ఆయకట్టును సృష్టించాలనే ముఖ్యమంత్రి కేసీఆర్ గారి సంకల్పం సంపూర్ణంగా సాకారం అవుతుంది.

52. తెలంగాణ ప్రభుత్వం తదేక దీక్షతో సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణాన్ని జరిపిస్తున్నది. కేంద్ర ప్రభుత్వం ఎలాంటి తోడ్పాటును అందించకపోగా, సకాలంలో అనుమతులు ఇవ్వకుండా అడ్డంకులు సృష్టిస్తున్నది. కృష్ణానదీ జలాల్లో తెలంగాణ రాష్ట్రం వాటాను నిర్ధారణ చేయమంటే విపరీతమైన తాత్సారం చేస్తున్నది. తెలంగాణలో నిర్మిస్తున్న ఒక ప్రాజెక్టుకు అయినా జాతీయ హోదా కల్పించాలని కేంద్రానికి ఎన్ని విజ్ఞప్తులు చేసినా స్పందించడం లేదు. యూపీ, కర్ణాటకల్లోని ప్రాజెక్టులకు మాత్రం జాతీయహోదా కల్పించి, కేంద్ర ప్రభుత్వం తన పక్షపాత బుద్ధిని బయట పెట్టుకున్నది.

53. ఏది ఏమైనా సరే, ఎవరు కలిసి వచ్చినా రాకున్నా సరే, ప్రజల ఆశీస్సులే కొండంత అండగా భావించి తెలంగాణ ప్రభుత్వం 1 కోటి 25 లక్షల ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యాన్ని అతి త్వరలోనే చేరుకునేందుకు కృతనిశ్చయంతో ముందుకు సాగుతున్నది.

నీటిపారుదల రంగానికి బడ్జెట్ లో రూ.26,885 కోట్లు ప్రతిపాదించడమైనది.

**విద్యుత్తు రంగం**

54. అన్నిరంగాలకూ 24 గంటలపాటు నిరంతరాయంగా, వ్యవసాయానికి ఉచితంగా నాణ్యమైన విద్యుత్తును సరఫరా చేస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ. వెలుగు జిలుగుల రాష్ట్రంగా తెలంగాణ కీర్తి నేడు దశదిశలా వ్యాపించింది. తెలంగాణలో కరెంటు కోతలు, పవర్ హాలిడేలకు శాశ్వత ముగింపునిచ్చి, ముఖ్యమంత్రి కేసీఆర్ గారు చరిత్ర సృష్టించారు.

55. తెలంగాణ ఆవిర్భవించిన నాడు రాష్ట్రంలో స్థాపిత విద్యుదుత్పత్తి సామర్థ్యం 7,778 మెగావాట్లు మాత్రమే. ముఖ్యమంత్రి గారి నేతృత్వంలో జరిగిన అద్భుతమైన కృషివల్ల నేడు తెలంగాణ స్థాపిత విద్యుదుత్పత్తి సామర్థ్యం 18,453 మెగావాట్లకు పెరిగింది. తెలంగాణ ఏర్పడిన తరువాత విద్యుత్తురంగ బలోపేతం కోసం, కరెంటు సరఫరా,

పంపిణీ వ్యవస్థలను మెరుగుపర్చడం కోసం ప్రభుత్వం 38 వేల 70 కోట్ల రూపాయలను ఖర్చు చేసింది.

56. భద్రాద్రిలో 1080 మెగావాట్ల సామర్థ్యంతో 4 యూనిట్లలో ఉత్పత్తి ప్రారంభమైంది. 800 మెగావాట్ల సామర్థ్యం కలిగిన కొత్తగూడెం విద్యుత్ ప్లాంటులోనూ ఉత్పత్తి ప్రారంభమైంది. మంచిర్యాల జిల్లా జైపూర్ లో 1200 మెగావాట్ల సామర్థ్యంతో సింగరేణి నిర్మించిన విద్యుదుత్పత్తి కేంద్రంలోనూ ఉత్పత్తి ప్రారంభమైంది. దీనికి అదనంగా 8,085 మెగావాట్ల ఉత్పత్తి సామర్థ్యం కలిగిన విద్యుత్తు ప్లాంట్ల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి.

57. నల్లగొండ జిల్లా దామరచర్లలో టీఎస్ జెన్ కో నిర్మిస్తున్న 4 వేల మెగావాట్ల ఉత్పత్తి సామర్థ్యం గల యాదాద్రి అల్ట్రా మెగా థర్మల్ పవర్ ప్లాంట్ పనులు చివరిదశకు వచ్చాయి. ఈ ఆర్థిక సంవత్సరంలోనే ఈ ప్లాంటు నుంచి కూడా ఉత్పత్తి ప్రారంభమవుతుందని తెలియజేయడానికి సంతోషిస్తున్నాను.

58. ప్రత్యామ్నాయ ఇంధన వనరుల ద్వారా విద్యుదుత్పత్తి చేయడంలోనూ తెలంగాణ అగ్రగామిగా నిలుస్తున్నది. రాష్ట్రం ఏర్పడిననాడు సోలార్ పవర్ కేవలం 74 మెగావాట్లు మాత్రమే ఉత్పత్తి

అయ్యేది. తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న ప్రత్యేక చర్యల వల్ల నేడు రాష్ట్రంలో 5,741 మెగావాట్ల సోలార్ పవర్ ఉత్పత్తి జరుగుతున్నది.

59. తలసరి విద్యుత్తు వినియోగం సైతం ఒక ప్రధాన ప్రగతి సూచిక. 2014-15లో తెలంగాణలో తలసరి విద్యుత్తు వినియోగం 1,356 యూనిట్లు మాత్రమే ఉండేది. 2021-22 నాటికి అది 2,126 యూనిట్లకు పెరిగింది. ఇదే సమయంలో జాతీయ సగటును గనుక పరిశీలిస్తే 1,255 యూనిట్లుగా ఉన్నది. అంటే తెలంగాణ తలసరి విద్యుత్తు వినియోగం, జాతీయ తలసరి వినియోగంకన్నా 69 శాతం ఎక్కువగా నమోదవడం మనకు గర్వకారణం.

విద్యుత్తు శాఖ కోసం ఈ బడ్జెట్ లో రూ.12,727 కోట్లు ప్రతిపాదించడమైనది.

**మిషన్ భగీరథ**

60. స్వతంత్ర భారతదేశ చరిత్రను పరిశీలిస్తే, ఇంతకాలం పాలించిన ప్రభుత్వాలు తమ చేతకానితనంతో ప్రజలకు కనీసం తాగేందుకు స్వచ్ఛమైన నీళ్ళను కూడా ఇవ్వలేదు. తాగునీటి కటకటతోపాటు కలుషిత జలాలతో వచ్చే వ్యాధుల బారినపడి ప్రజలు అనుభవించిన బాధలు వర్ణనాతీతం. దేశంలో తాగునీటి కష్టాలను సంపూర్ణంగా అధిగమించిన తొలి రాష్ట్రం మన తెలంగాణ రాష్ట్రమే.

61. గౌరవ ముఖ్యమంత్రివర్యులు శ్రీ కేసీఆర్ గారి మానస పుత్రిక అయిన మిషన్ భగీరథ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ఇంటింటికీ నల్లాల ద్వారా సురక్షిత జలాలు సరఫరా అవుతున్నాయి. కలుషిత జలాల ద్వారా సంక్రమించే వ్యాధులను అరికట్టడంలో తెలంగాణ ప్రభుత్వం పూర్తిగా సఫలీకృతమైంది. రాష్ట్రంలో ఫ్లోరైడ్ పీడ పూర్తిగా అంతమైంది. ఇంటింటికీ నల్లాల ద్వారా సురక్షితమైన నీటిని సరఫరా చేస్తున్న రాష్ట్రం తెలంగాణ అని 2020 సెప్టెంబర్ లో పార్లమెంట్ వేదికగా కేంద్రం ప్రకటించింది.

62. మిషన్ భగీరథను ప్రేరణగా తీసుకొని కేంద్ర ప్రభుత్వం "హర్ ఘర్ జల్ యోజన" కార్యక్రమాన్ని అమలుచేస్తున్నది. దేశానికే రోల్ మోడల్ గా మారిన మిషన్ భగీరథను నీతి ఆయోగ్ కూడా ప్రశంసించింది. 2022 అక్టోబర్ 2న కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన జల్ జీవన్ అవార్డుల్లో మిషన్ భగీరథకు ప్రథమ బహుమతి లభించింది.

63. మిషన్ భగీరథను అతి తక్కువ సమయంలో, అతి తక్కువ వ్యయంతో పూర్తి చేశామని గౌరవ సభ్యులతో పంచుకోవడానికి సంతోషిస్తున్నాను. ప్రాజెక్టుకు రూ.44,933.66 కోట్ల అంచనాతో పరిపాలనా అనుమతులకు మంజూరు చేయగా, ప్రాజెక్టు పూర్తయ్యేనాటికి చేసిన వాస్తవ వ్యయం రూ.36,900 కోట్లు మాత్రమే. ఖచ్చితమైన ప్రణాళికతో, అత్యంత పారదర్శకంగా, ఆధునిక పద్ధతులు

వినియోగించి నిర్ణీత సమయంలో పూర్తి చేయడం వల్ల ప్రభుత్వం రూ.8,033.66 కోట్ల ప్రజాధనాన్ని ఆదా చేయగలిగింది.

**ప్రజాపంపిణీ వ్యవస్థ**

64. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడగానే పేదలకు రేషన్ బియ్యం పంపిణీపై గత ప్రభుత్వాలు విధించిన పరిమితులను ఎత్తివేసింది. కుటుంబంలో ఎంతమంది ఉంటే అంతమందికి ఆరు కిలోల చొప్పున రేషన్ బియ్యం అందజేస్తున్నది.

65. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు 20,638 కోట్లు ఖర్చు చేసింది. కరోనా సమయంలో కూడా 4,072 కోట్లు ఖర్చు పెట్టి ప్రజలకు ఉచితంగా బియ్యం పంపిణీ చేసింది.

ఈ సంవత్సరం ప్రజా పంపిణీ వ్యవస్థకు రాష్ట్ర బడ్జెట్ లో రూ.3,117 కోట్లు ప్రతిపాదించడమైనది.

**ప్రజా సంక్షేమం - ఆసరా పింఛన్లు..**

66. గౌరవ ముఖ్యమంత్రి కేసీఆర్ గారి అభిప్రాయం ప్రకారం.. పేద ప్రజల కన్నీరు తుడవని ఆర్థిక ప్రగతి అస్థిరమైనది, అనైతికమైనది. దేశంలో కొన్ని రాజకీయ పక్షాలు ప్రజా సంక్షేమ పథకాలను "రేవడీ"

అనే పేరుతో అవహేళన చేస్తూ వ్యతిరేకిస్తున్నాయి. ఉచితాలు అని అంటూ, అనుచితంగా వ్యాఖ్యానిస్తున్నాయి.

67. ప్రతిదాన్నీ లాభనష్టాలతో చూసేందుకు పరిపాలన వ్యాపారం కాదు. సంక్షేమ పథకాలను లాభనష్టాల దృక్పథంతో కాకుండా, మానవాభివృద్ధి దృక్పథంతో చూడాలి. ఈ వివేకాన్ని కొన్ని రాజకీయ పక్షాలు కోల్పోవడం దురదృష్టకరం. గౌరవ ముఖ్యమంత్రి కేసీఆర్ గారు 2019 సంవత్సరంలో జరిగిన ఆర్థిక సంఘం సమావేశంలో ఇదే విషయంపై " హమ్ తో సర్కార్ చలా రహే హై.. వ్యాపార్ నహీ " అని కుండబద్దలు కొట్టినట్టు చెప్పారు.

68. పరిపాలనకు మానవీయ పరిమళాలను అద్దుతూ తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి సింహభాగం నిధులను వెచ్చిస్తున్నది. గత ప్రభుత్వాలు కంటి తుడుపుగా 200 రూపాయల పింఛన్ ఇచ్చినయి. తెలంగాణ ప్రభుత్వం ఆసరా పింఛన్ కింద ఇచ్చే మొత్తాన్ని 2,016 రూపాయలకు పెంచింది. దివ్యాంగులకు 3,016 రూపాయలకు పెంచింది.

69. ప్రజల కష్టాలెరిగిన ప్రభుత్వం గనుక మానిఫెస్టోలో పేర్కొనక పోయినా, ఎవరూ డిమాండ్ చేయకపోయినా బీడీ కార్మికులకు,

ఒంటరి మహిళలకు, ఫైలేరియా బాధితులకు, డయాలసిస్ పేషంట్లకు సైతం 2,016 రూపాయల పింఛన్ నెలనెలా అందజేస్తున్నది.

70. 2014లో పింఛన్లు పొందే లబ్దిదారుల సంఖ్య 29,21,828 ఉండేది. వీరి కోసం ప్రతిఏటా 861 కోట్లు ఖర్చయ్యేవి. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక ఆసరా పింఛన్ లబ్దిదారుల సంఖ్యను ప్రభుత్వం 44,12,882 మందికి పెంచింది. వీరి పింఛన్ల కోసం ప్రభుత్వం ప్రతిఏటా 11,628 కోట్లు ఖర్చు చేస్తున్నది. రాష్ట్రం ఆవిర్భవించిన నాటి నుంచి ఇప్పటివరకు 54,989 కోట్ల రూపాయలను ఆసరా పింఛన్లుగా లబ్ధిదారులకు అందించింది.

71. గత బడ్జెట్లో చెప్పిన విధంగా 57 ఏళ్లు నిండిన వారికి పింఛన్ ఇవ్వటం జరుగుతున్నది. ఈ మేరకు 2022లో కొత్తగా 8,96,592 మందికి ఆసరా పింఛన్లు మంజూరు చేయడం జరిగింది.

ఆసరా పింఛన్ల కోసం ఈ బడ్జెట్ లో రూ.12,000 కోట్లు ప్రతిపాదించడమైంది.

**దళితబంధు**

72. స్వతంత్ర భారతదేశంలో దళితజాతి నేటికీ అంతులేని వివక్షకు, దాడులకు గురవుతూనే ఉన్నది. రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ అంబేద్కర్ కృషి ఫలితంగా దళితుల జీవితాల్లో కొంతమేరకు వెలుతురు

ప్రసరించింది. కానీ, ఆ ప్రయత్నాన్ని దేశ పాలకులు ముందుకు తీసుకుపోలేదు. ఫలితంగా నేటికీ దళితవాడలు వెనుకబాటుతనానికీ, పేదరికానికీ చిరునామాలుగానే ఉండిపోతున్నాయి.

73. అణగారిన దళితజాతి సమగ్ర అభ్యుదయం కోసం తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహించి ప్రవేశపెట్టిన విప్లవాత్మకమైన పథకమే దళితబంధు. దళితజాతి స్వశక్తితో, స్వావలంబనతో జీవించాలనే బలమైన సంకల్పంతో ముఖ్యమంత్రి గారు ఈ పథకానికి రూపుదిద్దారు.

74. చరిత్రలో మునుపెన్నడూ లేనివిధంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతి దళిత కుటుంబానికి 10 లక్షల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నది. దళితబంధు సాయం వారి కుటుంబాలను ఆర్థికంగా బలోపేతం చేయడమే కాకుండా.. ఆ సంపద సామాజిక పెట్టుబడిగా మారి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ బలపడటానికి తోడ్పడుతుంది.

75. దళిత సోదరులు వ్యాపార రంగంలోనూ ఎదగాలనే సంకల్పంతో ప్రభుత్వ లైసెన్సుల ద్వారా చేసుకునే లాభదాయక వ్యాపారాల్లో రిజర్వేషన్లను అమలు చేస్తున్నది.

దళితబంధు పథకం కోసం ఈ బడ్జెట్లో రూ.17,700 కోట్లు ప్రతిపాదించడమైనది.

76. షెడ్యూలు కులాలు, తెగల అభివృద్ధే లక్ష్యంగా ప్రత్యేక ప్రగతి నిధి చట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్నది. ఎస్సీ, ఎస్టీల జనాభా దామాషాను అనుసరించి నిధుల కేటాయింపుకు చట్టబద్ధత కల్పించింది.

77. ఎస్సీ, ఎస్టీలకు ఉద్దేశించిన నిధులు ఇతర పథకాలకు మళ్లించకుండా రక్షణ కల్పించింది. ఏదైనా ఆర్థిక సంవత్సరంలో నిధులు పూర్తిగా ఖర్చుకాని పక్షంలో ఈ చట్టం ప్రకారం ఆ నిధులను తరువాతి సంవత్సరానికి ఖచ్చితంగా బదలాయింపు చేయాలి. ఎస్సీ ఎస్టీ ప్రత్యేక ప్రగతి నిధి ద్వారా ఇప్పటివరకు ఖర్చు చేసిన నిధుల వివరాలను ఎప్పటివలనే గౌరవ సభ్యులకు పెన్ డ్రైవ్ లో అందజేస్తున్నాం.

ఈ బడ్జెట్ లో షెడ్యూలు కులాల ప్రత్యేక ప్రగతి నిధి కింద రూ.36,750 కోట్లు ప్రతిపాదించడమైనది.

78. దళిత విద్యార్థులు విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించడానికి.. అంబేద్కర్ ఓవర్సీస్ స్కాలర్ షిప్ కింద 20 లక్షల ఆర్థిక సహాయాన్ని ప్రభుత్వం అందిస్తున్నది. ఈ పథకం కింద 953 మంది విద్యార్థులకు స్కాలర్ షిప్ లు మంజూరు చేయడం జరిగింది.

79. తెలంగాణ ఏర్పడే నాటికి ఎస్.సి.ల కోసం రెసిడెన్షియల్ విద్యాలయాలు 134 ఉంటే.. తెలంగాణ ఏర్పడిన తరువాత 268కు పెరిగాయి. వీటిలో విద్యార్థుల సంఖ్య 71,688 నుంచి 1,55,863 కు పెరిగింది.

80. దళితులకు గృహావసరాల కోసం 101 యూనిట్ల వరకు విద్యుత్తును ఉచితంగా ప్రభుత్వం అందిస్తున్నది. దీనికోసం ఇప్పటివరకు 251 కోట్ల నిధులు ఖర్చు చేసింది.

**గిరిజన సంక్షేమం**

81. ఇచ్చిన మాట ప్రకారంగా గిరిజనుల ఆకాంక్షలను నిజం చేస్తూ ముఖ్యమంత్రి కేసీఆర్ గారు గిరిజనులకు విద్య, ఉద్యోగాల్లో 10 శాతం రిజర్వేషన్లను అమలు చేస్తూ విప్లవాత్మక నిర్ణయం తీసుకొన్నారు.

82. 500 జనాభా దాటిన 2,471 గిరిజన తండాలను, గూడేలను.. గ్రామ పంచాయతీలుగా మార్చి మా తండాలో, మా గూడెంలో మా పాలన కావాలనే గిరిజనుల చిరకాల ఆకాంక్షను ముఖ్యమంత్రిగారు నెరవేర్చారు. ప్రస్తుతం మొత్తం 3,146 గిరిజన గ్రామ పంచాయతీలు రాష్ట్రంలో ఉన్నాయి. నూతనంగా ఏర్పడ్డ ప్రతి గిరిజన గ్రామ పంచాయతీకి భవన నిర్మాణం కోసం 20 లక్షల చొప్పున ప్రభుత్వం

నిధులు మంజూరు చేసింది. మద్యం షాపుల లైసెన్సుల కేటాయింపులో గిరిజనులకు రిజర్వేషన్లు కల్పించింది.

83. గిరిజన సంక్షేమ శాఖలో 1650 పోస్టుల భర్తీకి ప్రభుత్వం అనుమతినిచ్చింది. 1,287 తండాలకు, గూడేలకు రహదారి సౌకర్యం కల్పించడం కోసం 2,500 కిలోమీటర్ల మేర రోడ్ల నిర్మాణానికి 1,385 కోట్లు మంజూరు చేసింది.

84. 3,467 గిరిజన ఆవాసాల్లో వ్యవసాయానికి త్రీఫేజ్ కరెంటు సరఫరా సదుపాయం కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా 221 కోట్లు ఖర్చు చేసింది. రాష్ట్రంలోని ఒక లక్ష ఒక వెయ్యి గిరిజన కుటుంబాలకు 101 యూనిట్ల వరకు ఉచిత గృహ విద్యుత్ అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు 192 కోట్లు ఖర్చు చేసింది.

85. తెలంగాణ ప్రభుత్వం దేశంలో ఎక్కడా లేనివిధంగా 183 గిరిజన రెసిడెన్షియల్ విద్యాలయాలను ఏర్పాటు చేసింది. వీటిలో 75,410 మంది విద్యార్థులకు ఉన్నత ప్రమాణాలతో విద్యాబోధన జరుగుతున్నది.

86. ఆదివాసీల, బంజారాల ఆత్మగౌరవాన్ని సమున్నతంగా చాటే విధంగా తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర రాజధాని నడిబొడ్డున అత్యంత ఖరీదైన స్థలాలను కేటాయించి ఆదివాసీ, బంజారా భవన్లను

అద్భుతంగా నిర్మించింది. కొమురం భీం, సేవాలాల్ మహారాజ్ పేర్లతో ఏర్పాటైన ఈ భవనాలలో అధునాతనమైన వసతులను కల్పించింది. గౌరవ ముఖ్యమంత్రి కేసీఆర్ గారి స్వహస్తాల మీదుగా ఈ భవనాలను ప్రారంభించుకున్నాం. ఇది మన రాష్ట్రానికి గర్వకారణం.

87. ఆదివాసీ యోధుడు కొమురం భీం జయంతిని, బంజారాల ఆరాధ్యదైవమైన సేవాలాల్ మహరాజ్ జయంతిని ప్రతిఏటా ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్నది.

88. తెలంగాణ కుంభమేళాగా భావిస్తున్న సమ్మక్క, సారలమ్మ జాతరను ప్రభుత్వం అధికారిక ఉత్సవంగా నిర్వహిస్తున్నది. రెండేళ్లకోసారి జరిగే ఈ జాతరకు తరలివచ్చే లక్షలాది మంది ప్రజానీకానికి వివిధ సౌకర్యాలు కల్పించడం కోసం ఇప్పటి దాకా 354 కోట్లు ఖర్చు చేసింది.

89. వీటితోపాటు నాగోబా, బౌరంపూర్, జంగూబాయి, నాంచారమ్మ తదితర జాతరలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్నది.

ఈ బడ్జెట్ లో షెడ్యూల్ తెగల ప్రత్యేక ప్రగతి నిధి కింద రూ.15,233 కోట్లు ప్రతిపాదించడమైనది.

**బీసీ వర్గాల సంక్షేమం**

90. వృత్తిపనులపై ఆధారపడి జీవిస్తున్న బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ప్రత్యేక పథకాలు రూపొందించడంలో తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధతో పనిచేస్తున్నది. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం కోసం వృత్తి పనుల వారికి ప్రత్యేక ప్రోత్సాహకాలను అందిస్తున్నది.

91. పశుగణాభివృద్ధిలోనూ, మత్స్య పరిశ్రమ అభివృద్ధిలోనూ ప్రభుత్వం గణనీయమైన పురోగతిని సాధించింది. జీఎస్డీపీలో పశుసంపద రంగం వాటా 2014-15లో 6.3 శాతంగా ఉండగా, 2021-22 నాటికి 9 శాతానికి పెరిగింది. పశుసంపద రంగం విలువ 2021-22లో 93,599 కోట్లుగా ఉన్నది.

92. గొర్రెల పెంపకంపై ఆధారపడి జీవిస్తున్న గొల్ల కురుమలకు చేయూతనివ్వడం కోసం.. తెలంగాణ ప్రభుత్వం భారీఎత్తున గొర్రెల పంపిణీ చేపట్టింది. 11వేల కోట్ల వ్యయంతో 7.3 లక్షల యూనిట్ల గొర్రెల పంపిణీ లక్ష్యంగా ముందుకు సాగుతున్నది.

93. మన రాష్ట్రంలోని గొల్ల కుర్మల వద్ద దేశంలోకెల్లా అత్యధిక సంఖ్యలో గొర్రెలున్నాయి. తెలంగాణలో మాంస ఉత్పత్తి 2014లో 5.05 లక్షల మెట్రిక్ టన్నులు కాగా, 2022 నాటికి 10.85 లక్షల మెట్రిక్

టన్నులకు పెరిగింది. మాంస ఉత్పత్తిలో దేశంలో 5వ స్థానంలో నిలిచిన తెలంగాణ "పింక్ రెవల్యూషన్"ను సాధించింది.

**చేపల పెంపకం**

94. ఒకప్పుడు రాష్ట్ర అవసరాల కోసం చేపలు దిగుమతి చేసుకునే దశ నుంచి నేడు చేపలను ఎగుమతి చేసే దశకు రాష్ట్రం చేరుకున్నది. రాష్ట్రంలోని అన్ని జలాశయాల్లో చేపల పెంపకం జోరుగా సాగుతున్నది. ముఖ్యమంత్రి గారు దూరదృష్టితో చేపట్టిన మిషన్ కాకతీయ ద్వారా చెరువులు బాగయ్యాయి, కొత్తగా చెక్ డ్యాముల నిర్మాణం జరిగింది. సాగునీటి ప్రాజెక్టుల్లో భాగంగా నూతన రిజర్వాయర్లు నిర్మాణం చేయడంతోపాటు, చెరువులను ప్రాజెక్టులతో అనుసంధానించడం వల్ల చేపల పెంపకం ఊపందుకున్నది. వీటన్నింటిలోనూ ప్రభుత్వం ఉచితంగా చేప పిల్లలను వదిలి వాటిని పట్టి అమ్ముకునేందుకు గంగపుత్ర, ముదిరాజ్ సోదరులకు అవకాశం కల్పించింది.

95. 2016-17లో 2,190 కోట్ల విలువైన 1.93 లక్షల టన్నుల మత్స్య సంపద ఉత్పత్తికాగా, 2021-22లో 3.9 లక్షల టన్నులకు పెరిగింది. ఈ మత్స్య సంపద విలువ 5,860 కోట్లు. ఇది తెలంగాణ ప్రభుత్వం సృష్టించిన "బ్లూ రెవల్యూషన్" ద్వారా సమకూరిన సంపద.

## నేతన్నకు చేయూత

96. తెలంగాణ రాష్ట్రం చేనేత వస్త్రాలకు ప్రసిద్ధి. పోచంపల్లి, నారాయణపేట, గద్వాల, సిరిసిల్ల, సిద్దిపేట తదితర ప్రాంతాలు చేనేత కళకు కేంద్రాలుగా జాతీయ, అంతర్జాతీయ ఖ్యాతిని పొందాయి.

97. తెలంగాణ ఏర్పడకముందు గత పాలకుల హయాంలో చేనేత కార్మికుల బతుకులు గాలిలో దీపాలుగా ఉండేవి. చేతినిండా పని దొరికేది కాదు. తగిన మార్కెట్ వ్యవస్థగానీ, అమ్మకాలుగానీ ఉండేవికావు. ప్రభుత్వం నుంచి సరైన మద్దతు లభించకపోవడం తదితర కారణాల వల్ల చేనేతరంగం కృంగిపోయింది. నేత కార్మికులు ఆత్మహత్యలు చేసుకునే దుర్భరమైన పరిస్థితులు దాపురించాయి. స్వరాష్ట్రంలో తెలంగాణ ప్రభుత్వం చేనేతలకు గొప్ప అండదండలను అందిస్తున్నది. దీంతో చేనేత కార్మికుల బతుకుల్లో మంచి మార్పు వచ్చింది. వారి వృత్తికి భరోసా, భద్రత ఏర్పడింది. రాష్ట్ర ప్రభుత్వం బతుకమ్మ పండుగ సందర్భంగా పంపిణీ చేసే చీరల తయారీ ఆర్డర్లను చేనేత, పవర్ లూమ్ పరిశ్రమలకు అప్పగిస్తున్నది. దీంతో కార్మికులకు సంవత్సరమంతా చేతినిండా పని దొరుకుతున్నది.

98. రాష్ట్రవ్యాప్తంగా డిజిటల్ సర్వే నిర్వహించి 21,585 మంది చేనేత కార్మికులను, 43,104 మంది పవర్ లూమ్ కార్మికులను గుర్తించి

వారికి జియోట్యాగింగ్ నంబర్లను ఇవ్వడం జరిగింది. తద్వారా ప్రభుత్వం అందించే ప్రోత్సాహకాలు, పథకాల ప్రయోజనాలు పారదర్శకంగా, నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి బదిలీ అవుతున్నాయి.

99. ప్రభుత్వం చేనేత మిత్ర పథకం ద్వారా నూలు, రసాయనాల కొనుగోలుపై 50 శాతం సబ్సిడీని అందిస్తున్నది. చేనేతమిత్ర పథకం ద్వారా ఇప్పటి వరకు 20,501 మంది చేనేత కార్మికులకు 33.17 కోట్లు సబ్సిడీ లభించింది.

100. చేనేత కార్మికులకు ఆసరా పింఛన్ అందించడమే కాకుండా, నేతన్నకు బీమా పథకం కింద 5 లక్షల బీమాను అందిస్తున్నది. ఈ బీమా కోసం ప్రభుత్వం 21 కోట్ల ప్రీమియం మొత్తాన్ని చెల్లిస్తున్నది. విధివశాత్తూ మరణించిన కార్మికుడి కుటుంబానికి 10 రోజుల్లోపే 5 లక్షల రూపాయల బీమా మొత్తాన్ని అందజేస్తున్నది.

101. చేనేత కార్మికులకు చెందిన 1 లక్ష లోపు రుణాలను ప్రభుత్వం మాఫీ చేసింది. ఇప్పటివరకు 29 కోట్ల రూపాయల రుణాలు మాఫీ అయ్యాయి. చేనేత కార్మికులకు, సొసైటీలకు ప్రభుత్వం పావలావడ్డీ పథకం ద్వారా రుణాలను అందిస్తున్నది. ఇప్పటి వరకు 523 సొసైటీలకు 120 కోట్ల రుణాలను అందించడం జరిగింది.

102. వరంగల్లో కాకతీయ మెగా టెక్స్ టైల్ పార్క్ తోపాటు, సిరిసిల్లలో అపెరల్ పార్కును ఏర్పాటు చేసి వస్త్ర పరిశ్రమకు ప్రభుత్వం భారీ ప్రోత్సాహాన్ని అందిస్తున్నది. చేనేత కార్మికులకు ప్రత్యేక ప్రోత్సహకాలందించే ఉద్దేశ్యంతో 'నేతన్నకు చేయూత' పొదుపు పథకానికి శ్రీకారం చుట్టింది.

103. నేతన్నల ఆత్మబంధువు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహాన్ని ప్రభుత్వం జలదృశ్యం ఎదుట ఏర్పాటు చేసింది, వారి జయంతిని ఏటా అధికారికంగా నిర్వహిస్తున్నది.

104. రాష్ట్ర ప్రభుత్వం చేనేత పరిశ్రమను నిలబెట్టేందుకు తీవ్రమైన కృషి చేస్తుంటే, కేంద్ర ప్రభుత్వం అందుకు భిన్నంగా చేనేతరంగం ఉసురు తీస్తున్నది. అసలే అంతంతమాత్రం అమ్మకాలతో కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్న చేనేత రంగాన్ని మరింత దెబ్బతీస్తూ కేంద్రం చేనేత వస్త్రాలపై 5 శాతం జీఎస్టీ విధించడం శోచనీయం.

**గీత కార్మికుల సంక్షేమం**

105. తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గౌడన్నల సంక్షేమం కోసం ప్రత్యేక చర్యలు తీసుకొన్నది. చెట్ల రఖం బకాయిలు రద్దు చేయడమే కాకుండా, తాటి, ఈత చెట్లపై పన్ను వేసే పద్ధతికి స్వస్తి పలికింది. కొత్త సొసైటీల ఏర్పాటుకు అవకాశం కల్పించింది.

106. గీత కార్మికులకు మరింత లబ్ధి చేకూర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం నీరాను సాఫ్ట్ డ్రింక్ గా మార్చి అందించే ప్రాజెక్టును చేపట్టింది. ఇందుకోసం 25 కోట్ల రూపాయలను కేటాయించింది. నీరా ఉత్పత్తి, ప్రాసెసింగ్ యూనిట్ తో పాటు, నీరా కేఫ్ ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉంది.

107. ప్రమాదవశాత్తూ మరణించిన గీత కార్మికుల కుటుంబాలకు ప్రభుత్వం 5 లక్షల పరిహారాన్ని అందిస్తున్నది. దేశంలో మరే రాష్ట్రంలోనూ లేనివిధంగా మద్యం దుకాణాల కేటాయింపుల్లో గౌడ సోదరులకు 15శాతం రిజర్వేషన్లను తెలంగాణ ప్రభుత్వం కల్పించింది.

108. గౌడ సోదరుల ఆత్మగౌరవ ప్రతీక అయిన సర్దార్ సర్వాయి పాపన్న జయంతిని, వర్ధంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్నది. రాష్ట్రంలో రజక సోదరులకు నిర్వహించే లాండ్రీలు, నాయీ బ్రాహ్మణులు నిర్వహించే సెలూన్లకు ప్రభుత్వం 250 యూనిట్ల వరకు విద్యుత్తును ఉచితంగా అందిస్తున్నది.

**బీసీ రెసిడెన్షియల్ విద్యాసంస్థలు..**

109. తెలంగాణ ప్రభుత్వం బీసీ గురుకులాల సంఖ్యను గణనీయంగా పెంచింది. 2014 కు ముందు కేవలం 19 గురుకులాలు మాత్రమే ఉండేవి. అందులో 8 వేలమంది విద్యార్థులు మాత్రమే

చదువుకునేవారు. తెలంగాణ ప్రభుత్వం బీసీ రెసిడెన్షియల్ విద్యాలయాల సంఖ్యను 310 కి పెంచింది. వీటిలో రెసిడెన్షియల్ స్కూళ్లు మరియు జూనియర్ కాలేజీలు కలిపి 294 కాగా, మరో 2 మహిళా రెసిడెన్షియల్ వ్యవసాయ కళాశాలలు, 14 రెసిడెన్షియల్ డిగ్రీ కాలేజీలు ఉన్నాయి. రాష్ట్రంలోని బీసీ రెసిడెన్షియల్ విద్యాలయాల్లో 1,65,160 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు.

**మహాత్మా జ్యోతిబా పూలే విదేశీ విద్యానిధి**

110. బడుగువర్గాల అభ్యున్నతి కోసం అహర్నిశలూ కృషి చేసిన మహాత్మా జ్యోతిబా పూలే పేరున తెలంగాణ ప్రభుత్వం విదేశీ విద్యానిధి పథకాన్ని అమలు చేస్తున్నది. బీసీ వర్గాల విద్యార్థులు విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించడం కోసం ఒక్కో విద్యార్థికి 20 లక్షల స్కాలర్ షిప్ ను ప్రభుత్వం అందజేస్తున్నది. ఇందుకోసం ఎనిమిదిన్నరేళ్లలో ప్రభుత్వం 264 కోట్ల రూపాయల స్కాలర్ షిప్ లను 2,976 మంది విద్యార్థులకు అందించింది.

**బి.సి. వర్గాలకు ఆత్మగౌరవ భవనాలు**

111. రాష్ట్ర రాజధానిలో 41 బి.సి. కులాల వారి కోసం ఆత్మగౌరవ భవనాలను ప్రభుత్వం నిర్మిస్తున్నది. ఇందుకోసం అత్యంత ఖరీదైన 87 ఎకరాల భూమిని రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లాల్లో

కేటాయించింది. ఇందుకోసం ప్రభుత్వం 95.25 కోట్లు నిధులు కేటాయించింది. వీటిలో కొన్ని భవనాలను త్వరలోనే ప్రారంభించుకోబోతున్నాం.

బీసీ సంక్షేమం కోసం ఈ వార్షిక బడ్జెట్లో రూ.6,229 కోట్లు ప్రతిపాదించడమైనది.

**కల్యాణలక్ష్మి / షాదీ ముబారక్**

112. ఆడ పిల్లల పెండ్లి ఖర్చుల భారం భరించలేక నిరుపేద కుటుంబాలు పడుతున్న బాధలను చూసి చలించిపోయిన ముఖ్యమంత్రి కేసీఆర్ గారు, వారి భారాన్ని తగ్గించాలనే సదుద్దేశంతో మేనిఫెస్టోలో హామీ ఇవ్వకపోయినా కల్యాణలక్ష్మి/షాదీ ముబారక్ పథకాన్ని అమల్లోకి తెచ్చారు. ఈ పథకం కింద కుల మతాలకతీతంగా పేదింటి ఆడపిల్లల పెండ్లి ఖర్చుల కోసం తెలంగాణ ప్రభుత్వం 1,00,116 రూపాయల ఆర్థిక సాయం అందిస్తున్నది.

113. ఈ పథకం ప్రారంభించినప్పటి నుంచి ఇప్పటివరకు 12 లక్షల 469 మంది ఆడపిల్లలకు పెండ్లి ఖర్చుల కింద 10,416 కోట్లు సాయం అందించింది. 18 ఏండ్లు నిండిన ఆడ పిల్లలకే కల్యాణ లక్ష్మి సాయం వర్తిస్తుండటంతో బాల్య వివాహాలు పూర్తిగా తగ్గిపోయాయి.

కల్యాణలక్ష్మి / షాదీ ముబారక్ కోసం ఈ వార్షిక బడ్జెట్లో రూ.3,210 నిధులు ప్రతిపాదించనైనది.

## మహిళా శిశు సంక్షేమం

114. దేశం సంపూర్ణమైన అభివృద్ధిని సాధించాలంటే అన్ని రంగాల్లోనూ మహిళలకు న్యాయమైన ప్రాతినిధ్యం లభించాలి. మహిళాభ్యుదయం పట్ల నిబద్ధత కలిగిన తెలంగాణ ప్రభుత్వం పెద్ద ఎత్తున మహిళా సంక్షేమ కార్యక్రమాలను నిర్వహిస్తున్నది.

## ఆరోగ్యలక్ష్మి

115. తెలంగాణ ఆవిర్భవించేనాటికి కేవలం 56 శాతం అంగన్ వాడీ కేంద్రాల్లో మాత్రమే పౌష్టికాహారం ఇచ్చేవారు. ఇప్పుడు ఆరోగ్యలక్ష్మి పథకం ద్వారా నూటికి నూరుశాతం అంగన్ వాడీ కేంద్రాల్లో పాలు, గుడ్లతో కూడిన పౌష్టికాహారాన్ని అంగన్ వాడీల ద్వారా గర్భిణులకు, బాలింతలకు ప్రభుత్వం అందిస్తున్నది. మహిళల ఆరోగ్య సంరక్షణ కోసం అమలుచేస్తున్న ఆరోగ్యలక్ష్మి పథకం అమలుతీరును నీతి ఆయోగ్ ప్రశంసించింది.

116. ఎంతోకాలంగా ఖాళీగా ఉన్నటువంటి 2,356 అంగన్ వాడీ కార్యకర్తల పోస్టులను ఈ సంవత్సరంలో భర్తీచేయడం జరిగింది. అంతేకాక కొత్తగా 568 సూపర్వైజర్లను నియమించడం జరిగింది.

**బాలామృతం ప్లస్**

117. ఐదేళ్లలోపు పేద పిల్లలకు పోషకాహార లోపం ఏర్పడకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నది. వీరికోసం మొదటిగా గద్వాల, ఆసిఫాబాద్ జిల్లాల్లో మంచి బలవర్ధకమైన ఆహారాన్ని బాలామృతం ప్లస్ అందించడం జరిగింది. దీని ద్వారా అనతి కాలంలోనే పిల్లలు పోషకాహార లోపాన్ని అధిగమించారు. ఈ కార్యక్రమాన్ని గతేడాది ఆగస్టు నుంచి రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో అమలుచేస్తున్నది.

118. తెలంగాణ ఫుడ్స్ సంస్థలో నెలకు 2500 మెట్రిక్ టన్నుల ఉత్పాదక సామర్థ్యంతో నిర్మించిన కొత్త ప్లాంటును గతేడాది డిసెంబర్ 16 న ప్రారంభించుకొన్నాం. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 35,700 అంగన్ వాడి కేంద్రాలకు బాలామృతాన్ని తెలంగాణ ఫుడ్స్ సరఫరా చేస్తున్నది. మన పొరుగున ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కూడా బాలామృతాన్ని తెలంగాణ ఫుడ్స్ నుంచే సరఫరా చేస్తున్నది.

**అంగన్ వాడీ, ఆశాలకు పారితోషికాల పెంపు**

119. అంగన్ వాడీ టీచర్లకు తెలంగాణ ప్రభుత్వం 13,650 రూపాయల పారితోషికాన్ని చెల్లిస్తున్నది. ఉత్తర ప్రదేశ్ లో 7 వేలు, రాజస్థాన్ లో 7,500, మహారాష్ట్ర లో 8,325 మాత్రమే ఇస్తున్నారు. దేశంలోని అన్ని

రాష్ట్రాల కన్నా ఎక్కువ పారితోషికాన్ని తెలంగాణ ప్రభుత్వం అంగన్ వాడీలకు ఇస్తున్నదని సభాముఖంగా తెలియజేస్తున్నాను.

120. ఆశా కార్యకర్తలకు 2014 నాటికి 2 వేల రూపాయలు మాత్రమే ఉన్న పారితోషికాన్ని రాష్ట్ర ప్రభుత్వం 9750 రూపాయలకు పెంచింది. ఆశావర్కర్లకు మధ్యప్రదేశ్, రాజస్థాన్ లలో 3 వేలు, గుజరాత్ లో 6,700, కర్ణాటక, హర్యానాల్లో 4 వేలు, కేరళలో 5 వేలు మాత్రమే ఇస్తున్నారు. చిరుద్యోగులకు తెలంగాణ ప్రభుత్వం అత్యధికవేతనాలు చెల్లిస్తున్నప్పటికీ కొంతమంది స్వార్థ రాజకీయాల కోసం నోటికొచ్చినట్టు మాట్లాడుతున్నారు. వారు ఇకనైనా ఈ రకంగా మాట్లాడటం మానేయాలని ఆశిస్తున్నాం.

121. మహిళాభద్రతకు రాష్ట్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నది. ఇందుకోసం ప్రత్యేకంగా షిటీమ్ లను ఏర్పాటుచేసింది. ఈ బృందాలు ఈవ్ టీజింగ్ అరికట్టడంలో సమర్థవంతంగా పనిచేస్తున్నాయి. మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించే వాళ్లను కట్టడి చేస్తున్నాయి.

122. ప్రభుత్వం సివిల్ పోలీస్ ఉద్యోగ నియామకాల్లో 2015 నుంచి మహిళలకు 33 శాతం రిజర్వేషన్లను విధిగా పాటిస్తున్నది. ఆర్మ్డ్ రిజర్వ్ పోలీసు (AR) నియామకాల్లో 10 శాతం రిజర్వేషన్లను కల్పిస్తున్నది.

123. మహిళలు పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలనే సంకల్పంతో వారి అంకుర సంస్థలకు ప్రోత్సాహాన్ని కల్పించడం కోసం ప్రభుత్వం వినూత్నంగా వి-హబ్ ను నెలకొల్పింది.

124. మార్కెట్ కమిటీలలో ప్రభుత్వం రిజర్వేషన్లను ప్రవేశపెట్టింది. దీనివల్ల మహిళలకు చైర్ పర్సన్ లు అయ్యే అవకాశం లభించింది.

మహిళా శిశు సంక్షేమానికి ఈ బడ్జెట్ లో రూ.2,131 కోట్లు ప్రతిపాదించడమైనది.

**<u>మైనార్టీల సంక్షేమం..</u>**

125. తెలంగాణ ప్రభుత్వం సర్వధర్మ సమభావనను పాటిస్తున్నది. ఏ సామాజిక వర్గం పట్ల వివక్ష, విస్మరణ లేకుండా ప్రగతి ఫలాలను అందరికీ అందజేస్తున్నది. తెలంగాణ ఏర్పడకముందున్న ప్రభుత్వం మైనార్టీల సంక్షేమానికి ఏడాదికి 300 కోట్లు కూడా ఖర్చు చేసేది కాదు.

126. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన 2014 జూన్ నుంచి 2023 జనవరి వరకు ప్రభుత్వం 8,581 కోట్లను మైనార్టీల సంక్షేమం కోసం ఖర్చు చేసింది. 2021-22 ఆర్థిక సంవత్సరంలో 1,286 కోట్లను ఖర్చు చేయడం మైనార్టీ వర్గాల అభ్యున్నతి పట్ల తెలంగాణ ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనం.

127. రాష్ట్ర ప్రభుత్వం ముస్లిం మైనార్టీ ఆడపిల్లల కోసం షాదీముబారక్ పథకాన్ని 2014 నుంచి అమలు చేస్తోంది. గడిచిన ఎనిమిదిన్నర సంవత్సరాల్లో రెండు లక్షల 32వేల 713 మంది పెళ్లిళ్లకు 1903 కోట్లను ఖర్చు చేసింది. పెరుగుతున్న వివాహాలకు అనుగుణంగా,150 కోట్ల నిధులను అదనంగా కేటాయిస్తూ, ఈ సంవత్సరం 450 కోట్లు ప్రతిపాదిస్తున్నాము.

128. మైనారిటీ కార్పొరేషన్ అందించే రుణాల కోసం ఈ ఆర్థిక సంవత్సరానికి 270 కోట్ల రూపాయలు ఖర్చు చేయడానికి ప్రతిపాదించడం జరిగింది..ఇది 2022-23 కన్నా 239 కోట్లు ఎక్కువ.

129. పేద ముస్లిం మహిళలకు మైనారిటీ కార్పొరేషన్ ద్వారా 20 వేల కుట్టుమిషన్లు ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయించింది.

130. దేశంలోని మరే రాష్ట్రంలో కూడా తెలంగాణలో ఉన్నట్టు మైనార్టీ గురుకులాలు లేవు. రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీ విద్యార్థుల కోసం ప్రత్యేకంగా 203 మైనార్టీ గురుకుల స్కూళ్లను తొలుత ఏర్పాటు చేసింది. వీటిని మైనార్టీ జూనియర్ కాలేజీలుగా అప్ గ్రేడ్ చేసింది.

131. మైనార్టీ విద్యార్థుల విదేశీ విద్యకు సంబంధించి ఒక్కొక్క విద్యార్థికి 20 లక్షల చొప్పున స్కాలర్ షిప్ ను అందిస్తోంది.

132. ప్రభుత్వం అన్ని మతాల వారికి పండుగల సందర్భంగా ప్రత్యేక కానుకలను అందిస్తున్నది. రంజాన్ పండుగ సందర్భంగా 4 లక్షల 50 వేల మంది మహ్మదీయులకు, క్రిస్మస్ సందర్భంగా దాదాపు 3 లక్షల మంది క్రైస్తవులకు కొత్త బట్టలతో కూడిన ప్రత్యేక కానుకలను ప్రభుత్వం అందిస్తున్నది. తెలంగాణ ప్రజలు ఘనంగా జరుపుకొనే బతుకమ్మ పండుగ సందర్భంగా మహిళలకు కొత్త చీరలను పంపిణీ చేస్తున్నది.

ఈ బడ్జెట్ లో మైనారిటీ సంక్షేమం కోసం రూ.2,200 కోట్లు ప్రతిపాదించడమైనది.

**జర్నలిస్టుల సంక్షేమం**

133. జర్నలిస్టుల సంక్షేమం కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 100 కోట్ల నిధులను కార్పస్ ఫండ్ కింద కేటాయించింది. మీడియా అకాడమీ భవనాన్ని 15 కోట్లతో నిర్మిస్తున్నది. పనులు తుది దశకు చేరుకొన్నాయి. అతి త్వరలోనే ఈ భవనాన్ని ప్రారంభించుకొంటామని జర్నలిస్టు మిత్రులకు తెలియజేయడానికి సంతోషిస్తున్నాను.

**బ్రాహ్మణ సంక్షేమం**

134. తెలంగాణ ప్రభుత్వం బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ ద్వారా 2021-22లో 51 కోట్లు ఖర్చు చేసింది. ఈ పరిషత్ ద్వారా పేద బ్రాహ్మణులకు

ఉపాధి కల్పన కోసం ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్నది. వివేకానంద విదేశీ విద్యాపథకం కింద 20 లక్షల స్కాలర్ షిప్ ను అందజేస్తున్నది.

135. హైదరాబాద్ లోని గోపనపల్లిలో 6 ఎకరాల స్థలంలో 20 కోట్ల వ్యయంతో నిర్మించిన బ్రాహ్మణ సదనం ప్రారంభానికి సిద్ధంగా ఉంది. బ్రాహ్మణుల సంక్షేమం కోసం పరిషత్తు ద్వారా ఇప్పటి దాకా 160 కోట్ల రూపాయలను తెలంగాణ ప్రభుత్వం ఖర్చు చేసింది.

**న్యాయ సేవల అభివృద్ధి :**

136. రాష్ట్రంలోని ప్రజలకు సత్వర న్యాయం అందించడం కోసం జిల్లాల సంఖ్యకు అనుగుణంగా డిస్ట్రిక్ట్ కోర్టులను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా నూతనంగా ఏర్పడిన 23 జిల్లాలలో డిస్ట్రిక్ట్ కోర్టులను, న్యాయ సేవాధికార సంస్థలను ఇప్పటికే ఏర్పాటు చేసింది. ఈ కోర్టుల నిర్వహణ కోసం 1,721 పోస్టులను కొత్తగా మంజూరు చేసింది. 1050 కోట్ల అంచనా వ్యయంతో కొత్త కోర్టుల భవనాల నిర్మాణాన్ని చేపట్టడం జరుగుతుంది.

137. ఈ ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రంలో మరో 60 జూనియర్, సీనియర్, జిల్లా జడ్జి కోర్టులను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది.

**న్యాయవాదుల సంక్షేమం:**

138. దేశంలో ఎక్కడా లేనివిధంగా తెలంగాణ ప్రభుత్వం న్యాయవాదుల సంక్షేమం కోసం 100 కోట్ల నిధిని సమకూర్చింది. ఈ నిధులతో న్యాయవాదుల సంక్షేమ ట్రస్టు 22 వేల మంది న్యాయవాదుల కోసం ఆరోగ్య మరియు ప్రమాద బీమా పథకాలు ప్రారంభించింది. ఈ బీమా పథకాలవల్ల 8,053 మంది న్యాయవాదులు మరియు వారి కుటుంబ సభ్యులు 38.45 కోట్ల మేర లబ్ధి పొందటం జరిగింది.

**తెలంగాణకుహరితహారం**

139. పర్యావరణ పరిరక్షణ ప్రతి మానవుని విద్యుక్త ధర్మంగా భావించే మన ముఖ్యమంత్రి గారు 'తెలంగాణాకు హరితహారం' పేరుతో మొక్కలు నాటే కార్యక్రమాన్ని భారీఎత్తున చేపట్టారు. తెలంగాణకు హరితహారం స్థాయిలో మరే రాష్ట్రంలోనూ మొక్కలు నాటి, కాపాడే కార్యక్రమం అమలు కావడం లేదంటే అతిశయోక్తి లేదు.

140. హరితహారం కార్యక్రమంలో ప్రజలు ఉద్యమ స్ఫూర్తితో పాల్గొంటున్నారు. రాష్ట్రంలోని పురపాలక సంఘాలు, గ్రామ పంచాయతీలు తమ వార్షిక బడ్జెట్లో 10శాతం గ్రీన్ బడ్జెట్ కింద కేటాయించి, పచ్చదనాన్ని అభివృద్ధి చేయాలన్న నిబంధనను నూతన

మున్సిపల్, పంచాయతీరాజ్ చట్టాలలో ప్రభుత్వం పొందుపరిచింది. స్థానిక సంస్థల కృషితో తెలంగాణలోని ప్రతి పట్టణం, గ్రామం పచ్చదనంతో పరిఢవిల్లుతున్నది.

141. ఫారెస్ట్ సర్వే ఆఫ్ ఇండియా రూపొందించిన ఇండియా ఫారెస్ట్ రిపోర్ట్ 2021 ప్రకారం తెలంగాణలో మొత్తం గ్రీన్ కవర్ 7.70 శాతం పెరిగింది. ఇది 5.13 లక్షల ఎకరాలకు సమానం.

142. హరితహారం కార్యక్రమానికి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. ఐక్యరాజ్యసమితిలో భాగమైన ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్ (FAO), ఆర్బర్ డే ఫౌండేషన్.. హైదరాబాద్ నగరాన్ని 'ట్రీ సిటీ ఆఫ్ ద వరల్డ్ 'గా వరుసగా రెండుసార్లు గుర్తించింది. భారతదేశం నుంచి ఈ గుర్తింపు సాధించిన ఏకైక నగరం మన హైదరాబాద్ మాత్రమే.

143. నీతి ఆయోగ్ వెలువరించే సుస్థిర అభివృద్ధి లక్ష్యాల నివేదికలో దేశంలో పచ్చదనం పెంపుదలలో తెలంగాణ మొదటి స్థానంలో ఉన్నట్టు పేర్కొన్నది. దక్షిణ కొరియాలోని ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఆఫ్ హార్టికల్చర్ ప్రొడ్యూసర్స్ హైదరాబాద్ నగరానికి 'వరల్డ్ గ్రీన్ సిటీ అవార్డు -2022' ప్రకటించింది.

144. పర్యావరణ పరిరక్షణలో ప్రతి పౌరుడూ తన బాధ్యతను నిర్వర్తించాలనే ఆశయంతో ముఖ్యమంత్రి కేసీఆర్ గారు వినూత్నంగా హరితనిధిని ఏర్పాటు చేయించారు. ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ శాఖలు, ప్రభుత్వ ఉద్యోగులు, విద్యార్థులు మొదలైన వారినుండి సేకరించిన విరాళాలతో హరితనిధి ఏర్పడుతున్నది.

145. తెలంగాణ ప్రభుత్వం 1500 కోట్ల వ్యయంతో 13 లక్షల ఎకరాల అడవికి పునరుజ్జీవం కల్పించడం జరిగింది. 11వేల కిలోమీటర్ల పరిధిలో అడవుల రక్షణ కోసం సరిహద్దు కంచెలను ఏర్పాటు చేయడం జరిగింది.

146. తెలంగాణ ప్రభుత్వం అడవుల పరిరక్షణ కోసం తీసుకొన్న చర్యల ఫలితంగా వన్యమృగాల సంఖ్య గణనీయంగా పెరిగింది. రాష్ట్రంలో పులుల సంఖ్య 26కు చేరింది. చిరుతల సంఖ్య 341 అయ్యింది. అంతరించి పోతున్న అనేక పక్షి జాతులు తిరిగి ఊపిరి పోసుకొన్నాయి.

147. ముఖ్యమంత్రి కేసీఆర్ గారి మార్గనిర్దేశనంలో హరిత తెలంగాణ నిర్మాణం కోసం నిరంతరం పరిశ్రమిస్తున్న స్థానిక సంస్థల ప్రతినిధులకు, అటవీశాఖ సిబ్బందికి, హరిత సైనికులుగా పనిచేస్తున్న ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.

అటవీశాఖకు మరియు తెలంగాణకు హరితహారానికి ఈ బడ్జెట్లో రూ.1,471 ప్రతిపాదించనైనది.

**విద్యారంగం**

148. విజ్ఞాన ప్రపంచం తలుపులు తెరవడానికి కావల్సిన సాధనం విద్య. విద్య జ్ఞానంతోపాటు మనిషికి ఒక గుర్తింపునిస్తుంది. ఆత్మ విశ్వాసాన్ని పెంపొందిస్తుంది. విద్యావంతులతో నిండిన సమాజమే అభివృద్ధి పథంలో వేగంగా పయనించగలుగుతుంది. విద్యా వికాసాన్ని సాధించిన సమాజాలు ఇతర రంగాలలోనూ ముందంజలో ఉంటాయి.

149. మన రాష్ట్రంలో విద్యారంగాన్ని బలోపేతం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తున్నది. పాఠశాల విద్యతో మొదలుకొని విశ్వవిద్యాలయాల స్థాయి వరకు పటిష్టమైన అభివృద్ధి ప్రణాళికతో ముందుకు వెళ్తున్నది.

150. పేద విద్యార్థులు చదువులో ముందుండాలంటే అది గురుకుల విద్య ద్వారానే సాధ్యమవుతుందని బలంగా విశ్వసించిన ముఖ్యమంత్రి కేసీఆర్ గారు రాష్ట్రంలో గురుకుల విద్యకు పెద్దపీట వేశారు. రాష్ట్రం ఏర్పడ్డ తొలినాళ్లలో 293 గురుకులాలు అరకొర వసతులతో అధ్వాన్నంగా ఉండేవి, వాటిలో లక్షా 31 వేల విద్యార్థులు వసతుల లేమిని ఎదుర్కొంటూ చదువుకునే వారు.

151. తెలంగాణ ఏర్పడగానే ముఖ్యమంత్రి కేసీఆర్ గారు నూతన గురుకుల విద్యాలయాల స్థాపనకు నడుం బిగించారు. నేడు రాష్ట్రంలో గురుకులాల సంఖ్య 1,002 వరకు పెరిగితే, వీటిలో చదివే విద్యార్థుల సంఖ్య 5 లక్షల 59 వేలకు పెరిగింది.

152. రాష్ట్రం ఏర్పడ్డ తొలినాళ్లలో గురుకులాల మీద బడ్జెట్ కేటాయింపులు 784 కోట్లు ఉంటే.. తెలంగాణ ప్రభుత్వం ఈ కేటాయింపులను భారీగా పెంచింది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో 3,400 కోట్లకు కేటాయింపులను పెంచింది. పేదలకు ఉన్నత ప్రమాణాలు కలిగిన విద్యను అందించడం పట్ల ప్రభుత్వానికి ఉన్న నిబద్ధతకు ఇది నిదర్శనం.

**మన ఊరు మన బడి**

153. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులను దశలవారీగా మెరుగుపరిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం మన ఊరు మనబడి అనే బృహత్తర కార్యక్రమాన్ని అమలు చేస్తున్నది. ఈ పథకం కింద డిజిటల్ విద్యతోపాటు, తాగునీటి వసతి, సరిపడినంత ఫర్నిచర్, ప్రహరీలు, కిచెన్ షెడ్ లు, మరుగుదొడ్ల నిర్మాణం వంటి పన్నెండు రకాల అంశాల్లో పనులు చేపట్టడం జరుగుతుంది.

154. రాష్ట్రవ్యాప్తంగా 26,065 పాఠశాలల్లో మూడు దశల్లో మౌలిక సదుపాయాలను కల్పించడం కోసం 7,289 కోట్లు కేటాయించింది. మొదటి దశలో భాగంగా 9,123 పాఠశాలల్లో 3,497 కోట్లతో మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నది. వీటిలో ఇప్పటికే చాలా స్కూళ్లలో పనులు పూర్తయ్యాయి. ఊరూరా ఉత్సవంలా సంబురంగా ప్రారంభోత్సవాలు జరుపుకుంటున్నారు.

**యూనివర్సిటీల్లో మౌలిక వసతుల కల్పన**

155. రాష్ట్రవ్యాప్తంగా అన్ని విశ్వవిద్యాలయాల్లో మౌలిక వసతుల కల్పన, హాస్టల్ భవనాల ఆధునీకరణ, మరియు కొత్త భవనాల నిర్మాణం కోసం 500 కోట్లు ఈ వార్షిక బడ్జెట్లో ప్రభుత్వం ప్రతిపాదిస్తున్నది. యూనివర్సిటీల్లో మౌలిక వసతుల కల్పన కోసం ఇంత పెద్ద ఎత్తున నిధులు కేటాయించడం రాష్ట్ర చరిత్రలో ఇదే తొలిసారి.

**ఆంగ్ల మాధ్యమం**

156. ఆంగ్ల మాధ్యమంలో బోధించడానికి అనుగుణంగా రాష్ట్రంలో ఉపాధ్యాయులందరికీ శిక్షణ ఇవ్వటం జరిగింది. ప్రతిష్టాత్మక సంస్థ టాటా ఇనిస్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ మన పాఠ్యపుస్తకాలను పరిశీలించి అభినందించింది.

157. మన రాష్ట్రంలో 2,962 ఇంటర్మీడియట్ కళాశాలల్లో 9,48,321 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులు ఎంసెట్, నీట్, జేఈఈ తదితర ప్రవేశ పరీక్షలకు హాజరు కావడానికి కావాల్సిన శిక్షణను ప్రభుత్వం అందిస్తున్నది.

**సాంకేతిక విద్య**

158. రాష్ట్రంలో సాంకేతిక విద్యకు కూడా ప్రభుత్వం పెద్ద పీట వేసింది. గత ఎనిమిదిన్నరేళ్లలో కొత్తగా 14 పాలిటెక్నిక్ కళాశాలలను ఏర్పాటు చేసింది. 2023-24 విద్యాసంవత్సం నుంచి రంగారెడ్డి జిల్లా మహేశ్వరంలో, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరులో పాలిటెక్నిక్ కళాశాలలను ప్రారంభించబోతున్నది.

159. రాష్ట్రంలో జెఎన్టీయూ పరిధిలో 4 కొత్త ఇంజినీరింగ్ కాలేజీలను ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్నది. వీటిలో సిరిసిల్ల, వనపర్తి కళాశాలలు ఇప్పటికే ప్రారంభమయ్యాయి. త్వరలోనే మహబూబ్ నగర్, కొత్తగూడెంలో ప్రారంభించబోతున్నది.

160. తెలంగాణలో అభివృద్ధి చెందుతున్న ఫార్మారంగాన్ని దృష్టిలో ఉంచుకొని సుల్తాన్ పూర్ లో జేఎన్ టీయూకు అనుబంధంగా యూనివర్సిటీ కాలేజీ ఆఫ్ ఫార్మాసుటికల్ సైన్సెస్ ను ఏర్పాటు చేసింది.

**విద్యార్థులకు సన్నబియ్యంతో భోజనం**

161. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 28,606 పాఠశాలల్లో చదువుతున్న 25.26 లక్షల మంది విద్యార్థులకు, 4,237 హాస్టళ్లు, ఇతర విద్యా సంస్థల్లోని 9.77 లక్షల మంది విద్యార్థులకు ప్రభుత్వం సన్నబియ్యంతో భోజనం పెడుతున్నది. ఇందుకోసం ప్రతి నెలా 21,868 మెట్రిక్ టన్నుల ఫోర్టిఫైడ్ రైస్ మరియు సన్నబియ్యాన్ని సరఫరా చేస్తున్నది.

162. భావి పౌరులకు బలవర్ధకమైన ఆహారాన్ని అందించాలనే మంచి మనసుతో ముఖ్యమంత్రి గారు విద్యార్థులకు సన్నబియ్యంతో భోజనాన్ని అందుబాటులోకి తెచ్చారు. దేశంలో సన్నబియ్యంతో విద్యార్థులకు అన్నం పెడుతున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ మాత్రమే.

163. మధ్యాహ్న భోజనం పథకంలో వంటపని చేసే 54,201 మందికి ఇప్పటివరకు_నెలకు 1000 రూపాయల పారితోషికం అందుతున్నది. గౌరవ ముఖ్యమంత్రి కేసీఆర్ గారు గతంలో ఈ సభలో ప్రకటించిన విధంగా వారికిచ్చే పారితోషికాన్ని నెలకు 3 వేలకు పెంచామని తెలియచేయడానికి సంతోషిస్తున్నాను.

164. తెలంగాణ విద్యావికాసం కోసం ప్రభుత్వం విద్యాశాఖ ద్వారానే కాకుండా వ్యవసాయం, వైద్యం, అటవీ, పశు సంవర్ధక, మత్స్య, కార్మిక

శాఖల ద్వారానూ, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ శాఖల ద్వారానూ పెద్ద ఎత్తున నిధులు ఖర్చు చేస్తున్నది.

విద్యాశాఖకు ఈ బడ్జెట్ లో రూ.19,093 కోట్లు ప్రతిపాదించడమైనది.

**వైద్యారోగ్య రంగం**

165. దేశంలోకెల్లా అత్యుత్తమ వైద్యసేవలందిస్తున్న అగ్రగామి రాష్ట్రంగా తెలంగాణ గొప్ప ప్రగతిని సాధించింది. పేద ప్రజలకు ఉత్తమమైన వైద్య సేవలందించడంలో తెలంగాణ రాష్ట్రం దేశంలో మూడో స్థానంలో నిలిచిందని నీతి ఆయోగ్ ప్రశంసించింది. రాష్ట్ర ప్రభుత్వం చేసిన కృషి వల్ల 2014 లో 92 గా ఉన్న మాతృ మరణాల రేటు (MMR) 2022 నాటికి గణనీయంగా తగ్గి 43కు చేరింది. ఈరోజు దేశంలో అతి తక్కువ మాతృ మరణాలు జరుగుతున్న రాష్ట్రాల్లో తెలంగాణ మూడోస్థానంలో ఉన్నది.

అదే విధంగా శిశు మరణాల రేటు (ఐఎంఆర్) 2014 లో ముప్పై తొమ్మిది ఉండగా, ప్రస్తుతం అది ఇవరై ఒకటికి తగ్గింది.

166. ప్రతి లక్ష జనాభాకు సగటున 19 ఎంబీబీఎస్ సీట్లతో వైద్యవిద్యలో తెలంగాణ ప్రప్రథమస్థానంలో ఉన్నది. అదే విధంగా మెడికల్ పీజీ సీట్లలో ప్రతి లక్ష జనాభాకు 7 సీట్లతో దేశంలో రెండోస్థానంలో ఉన్నది.

167. రాష్ట్రం ఏర్పడ్డ తొలినాళ్లలో కేవలం 1400 ఆక్సిజన్ బెడ్ లు ఉంటే.. వాటి సంఖ్యను ఇరవై రెట్లు పెంచి 27,966 బెడ్ లకు చేర్చటం జరిగింది.

**కంటి వెలుగు:**

168. సర్వేంద్రియానాం నయనం ప్రధానం అని ఆర్యోక్తి. చూపు తగ్గితే జీవితం మసకబారి పోతుంది. రాష్ట్రంలో కంటిచూపు సమస్యలతో బాధపడుతున్నవారి కష్టాలు తీర్చడం కోసం ప్రభుత్వం కంటి వెలుగు పథకాన్ని అమలు చేస్తున్నది. తొలిదశ విజయం స్ఫూర్తితో రెండవదశ కంటి వెలుగు నేత్రవైద్య శిబిరాలను భారీ ఎత్తున కొనసాగిస్తున్నది.

169. కంటిచూపు సమస్యల నివారణ కోసం రాష్ట్రవ్యాప్తంగా భారీ ఎత్తున ఉచిత కంటి పరీక్షలు జరిపి కళ్లద్దాలను సైతం అందిస్తున్న కంటి వెలుగు పథకం దేశానికే స్ఫూర్తిదాయకంగా నిలిచింది.

170. 2018 లో కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిన తెలంగాణ ప్రభుత్వం 1 కోటి 54 లక్షల మందికి పరీక్షలు నిర్వహించి, 40 లక్షలకు పైగా కళ్ళద్దాలను పంపిణీ చేసి రికార్డు సృష్టించింది.

171. ఇటీవలనే రెండవ విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని గౌరవ ముఖ్యమంత్రి కేసీఆర్ గారి ఆధ్వర్యంలో కేరళ రాష్ట్ర ముఖ్యమంత్రి

పినరయి విజయన్ గారి చేతుల మీదుగా ఖమ్మంలో ప్రారంభించుకున్నాం.

172. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్, పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ సింగ్ మాన్ తమ తమ రాష్ట్రాల్లోనూ కంటివెలుగును అమలు చేస్తామని ప్రకటించడం మనకు గర్వకారణం.

**సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులు**

173. రాష్ట్రంలో వైద్య సేవలను మరింత విస్తరించాలని, పేదలకు సూపర్ స్పెషాలిటీ వైద్యాన్ని అందుబాటులోకి తేవాలనే లక్ష్యంతో ప్రభుత్వం పెద్దఎత్తున సూపర్ స్పెషాలిటీ హాస్పిటళ్లను నిర్మిస్తున్నది. రాజధాని నగరం హైదరాబాద్ నలువైపులా గచ్చిబౌలి, ఎల్బీ నగర్, అల్వాల్, సనత్ నగర్ ప్రాంతాల్లో ప్రభుత్వం భారీ ఎత్తున సూపర్ స్పెషాల్టీ ఆస్పత్రుల నిర్మాణం చేపట్టింది. ఇందులో 2,679 కోట్ల రూపాయలతో మూడు ఆస్పత్రుల పనులు ప్రారంభమైనాయి. ఈ ఆసుపత్రుల నిర్మాణంతో 4,200 పడకలు అందుబాటులోకి వస్తాయి. వచ్చే ఆర్థిక సంవత్సరంలో పనులు పూర్తి చేసి ప్రభుత్వం వైద్య సేవలను అందుబాటులో తేనుంది. వీటితో పాటు నిమ్స్ లో మరో 2 వేల పడకలు అదనంగా అందుబాటులోకి తెస్తున్నది.

**వరంగల్లు లో హెల్త్ సిటీ**

174. తెలంగాణ ప్రభుత్వం వరంగల్ నగరంలో అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో హెల్త్ సిటీ నిర్మాణాన్ని ప్రారంభించింది. ఇందులో భాగంగా 1100 కోట్ల ఖర్చుతో రెండు వేల బెడ్ల సామర్థ్యంతో సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ భవన నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. వచ్చే ఆర్థిక సంవత్సరంలోనే దీన్ని పూర్తిచేసి, ప్రారంభించాలని ప్రభుత్వం బలమైన సంకల్పంతో ఉంది. పేద ప్రజలకు కార్పోరేట్ స్థాయి వైద్యం అందాలని, అందుకు తగిన స్థాయిలో భవనాలు, వసతులు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం తాపత్రయపడుతుంది.

175. ప్రభుత్వం ఆసుపత్రి భవనాలు నిర్మించినా.. విద్యాలయాల భవనాలు నిర్మించినా, దేశానికే ఆదర్శంగా గ్రామగ్రామాన వైకుంఠధామాలు నిర్మించినా, స్వచ్ఛ గ్రామాల సాధన కోసం డంపు యార్డులు నిర్మించినా, రైతు వేదికలు నిర్మించినా, సమీకృత కలెక్టరేట్లు నిర్మించినా, కొమురంభీం, సేవాలాల్ మహారాజ్ ల పేరుతో ఆదివాసీ, బంజారా భవనాలు నిర్మించినా, సెక్రటరియేట్ భవనాన్ని నిర్మించినా, యాదగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని వైభవోపేతంగా పునర్నిర్మించినా, ట్యాంక్ బండ్ తీరాన అమరుల స్మారక కేంద్రాన్ని నిర్మించినా, బాబా సాహెబ్ అంబేద్కర్ మహాశయుని విగ్రహాన్ని

ఆకాశమంత ఎత్తున ప్రతిష్ఠిస్తున్నా... ఎందు కోసం అధ్యక్షా..? ప్రజలకు మెరుగైన సేవలందించడం కోసం. తెలంగాణ అస్తిత్వాన్ని, ఆత్మగౌరవాన్ని ప్రపంచం ముందు సమున్నతంగా నిలబెట్టాలనే ఆశయం కోసం. ఈ నిర్మాణ పనులన్నీ ప్రజల కోణంలోనే జరుగుతున్నాయన్న విషయాన్ని విజ్ఞులైన తెలంగాణ ప్రజలు ఇప్పటికే గ్రహించారు.

**జిల్లాకో మెడికల్ కాలేజీ**

176. తెలంగాణలో మారుమూల ప్రాంతాలకు సైతం వైద్య విద్యను చేరువ చేస్తూ వైద్య సేవలను మరింత విస్తృత పరిచేందుకు రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో ఒక మెడికల్ కాలేజీని ఏర్పాటు చేయాలని ప్రభుత్వం సంకల్పించింది. సమైక్య పాలనలో తెలంగాణ ప్రాంతంలో కేవలం మూడే మెడికల్ కాలేజీలు ఉండేవి.

177. తెలంగాణ ఏర్పడిన తరువాత మహబూబ్ నగర్, నల్లగొండ, సూర్యాపేట, సిద్దిపేటలలో మరో నాలుగు కాలేజీలు ప్రారంభించుకొన్నాం. ఈ విద్యాసంవత్సరంలో సంగారెడ్డి, మహబూబాబాద్, మంచిర్యాల, జగిత్యాల, వనపర్తి, కొత్తగూడెం, నాగర్ కర్నూల్, రామగుండంలలో ఇంకో 8 మెడికల్ కాలేజీలను

ప్రారంభించుకున్నాం. గౌరవ ముఖ్యమంత్రి కేసీఆర్ గారు ఈ కాలేజీల్లో బోధనా కార్యక్రమాలను ఒకేసారి ప్రారంభించారు.

178. 2023 సంవత్సరంలో నిర్మల్, ఆసిఫాబాద్, భూపాల్ పల్లి, జనగామ, కామారెడ్డి, కరీంనగర్, ఖమ్మం, సిరిసిల్ల, వికారాబాద్ లలో మరో 9 మెడికల్ కాలేజీల ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దీంతో రాష్ట్రంలోని మొత్తం మెడికల్ కాలేజీల సంఖ్య 26 కు చేరనుంది. ఈ కాలేజీలకు అనుబంధంగా ప్రతి జిల్లాలో నర్సింగ్ కాలేజీ ఏర్పాటు చేయాలని నిర్ణయించడమైనది.

179. ప్రభుత్వ వైద్య కళాశాలల్లో ఎంబీబీఎస్ సీట్ల సంఖ్య 2014లో 850 ఉంటే.. అవి 2022 నాటికి 2,915కు పెరిగాయి. పీజీ సీట్లు 2014లో 515 ఉంటే అవి 2022 నాటికి 1,208కి పెరిగాయి. ప్రభుత్వ, ప్రైవేటు మెడికల్ కాలేజీలు కలుపుకుంటే.. రాష్ట్రంలో ఎంబీబీఎస్ సీట్లు 6,715, పీజీ సీట్లు 2548 ఉన్నాయి.

**బస్తీ దవాఖానలు, పల్లె దవాఖానలు**

180. గతంలో హైదరాబాద్ నగరంలో బస్తీ ప్రజలకు సుస్తీ చేస్తే ప్రైవేటు దవాఖానాలే దిక్కయ్యేవి. ప్రభుత్వ వైద్యసేవలు అందుబాటులో ఉండేవి కావు. నిరుపేదల బస్తీలలో చక్కని సౌకర్యాలతో వైద్యశాలలను ప్రారంభించిన ఘనత మన ముఖ్యమంత్రి గారికే దక్కుతుంది. నేడు

రాష్ట్రవ్యాప్తంగా పట్టణ ప్రాంతాల్లో 342 బస్తీ దవాఖానలు పేద ప్రజలకు మెరుగైన వైద్యసేవలనందిస్తున్నాయి. ఈ బస్తీ దవాఖానాల్లో అందిన సేవలను క్యుములేటివ్ గా లెక్కిస్తే రెండు కోట్ల మేరకు ఓపీ సేవలందాయి.

181. వీటికి కొనసాగింపుగా రాష్ట్రవ్యాప్తంగా అన్ని పట్టణాల్లో మరో వంద బస్తీ దవాఖానలు ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించింది. విజయవంతమైన బస్తీ దవాఖానాల స్ఫూర్తితో గ్రామీణ ప్రాంతాల్లో ఉండే ఏఎన్ఎం సబ్ సెంటర్లను పల్లె దవాఖానలుగా అప్ గ్రేడ్ చేయాలని ముఖ్యమంత్రి కేసీఆర్ గారు నిర్ణయించారు. దీంతో ప్రాథమిక వైద్య సేవలు, గ్రామీణ ప్రజలకు మరింత మెరుగ్గా అందుబాటులోకి వస్తాయి.

**డయాలసిస్ సేవలు**

182. ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణలో కేవలం మూడంటే మూడే డయాలసిస్ సెంటర్లు ఉండేవి. తెలంగాణ ప్రభుత్వం పేషంట్లు పడుతున్న బాధలను గుర్తించి 104 డయాలసిస్ సెంటర్లను అందుబాటులోకి తెచ్చింది. సీఎం కేసీఆర్ గారు ఉదార హృదయంతో డయాలసిస్ పేషంట్లకు ఆసరా పింఛన్ల సైతం అందిస్తుండటంతో వారికెంతో ఊరట లభించింది. వీరికి ఉచిత బస్ పాస్ సౌకర్యం కూడా అందుబాటులో ఉంది.

**మాతాశిశు ఆరోగ్యం.. పౌష్టికాహారం**

183. మాతృమరణాలు ప్రతి లక్ష ప్రసవాలకు 70 కంటే తక్కువగా ఉండాలని సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సూచిక చెప్తున్నది. రాష్ట్రంలో ఎంఎంఆర్ ఈరోజున నలబై మూడుగా ఉంది. తద్వారా రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ఈ లక్ష్యాన్ని చేరుకొన్నది. చిత్తశుద్ధితో, ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, తీసుకొన్న కార్యాచరణ మూలంగానే ఇది సాధ్యపడింది.

**కేసీఆర్ కిట్**

184. గర్భం ధరించిన దశలో శ్రామిక మహిళలు కోల్పోయే ఆదాయాన్ని ప్రభుత్వమే అందించి వారి ఆరోగ్యాన్ని పరిరక్షించాలనే ఉదాత్త లక్ష్యంతో 2017 జూన్ 2న కేసీఆర్ కిట్ పథకం ప్రారంభమైంది. ప్రభుత్వ వైద్యశాలల్లో మహిళలు సురక్షితంగా ప్రసవించాలనే లక్ష్యం కూడా ఈ పథకంలో ఉంది.

185. కేసీఆర్ కిట్ లో తల్లీబిడ్డలకు ఉపయోగపడే 16 వస్తువులతో కూడిన ప్రత్యేక కిట్ ను ప్రభుత్వం అందిస్తున్నది. కేసీఆర్ కిట్ పథకం కింద ఇప్పటివరకు 13.91 లక్షల మంది మహిళలు లబ్ధి పొందారు.

186. 2015-16లో ప్రభుత్వాసుపత్రుల్లో ప్రసవాలు 30.5 శాతం మాత్రమే ఉండేవి, కేసీఆర్ కిట్ పథకం అమలుతోపాటు, ఎంసీహెచ్

హాస్పిటళ్లను బలోపేతం చేయడంతో ప్రభుత్వాసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య రెట్టింపై 61 శాతానికి పెరిగింది.

**కేసీఆర్ న్యూట్రిషన్ కిట్**

187. గర్భవతులలో పోషకాహారలోపం తలెత్తకుండా ఉండేందుకు న్యూట్రిషన్ కిట్ ఇచ్చే కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రారంభించింది. గర్భిణుల్లో రక్తహీనత సమస్య అధికంగా ఉన్న ఆదిలాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, జయశంకర్ భూపాలపల్లి, జోగులాంబ గద్వాల, కుమురంభీమ్ ఆసిఫాబాద్, ములుగు, నాగర్ కర్నూలు, వికారాబాద్ లలో ఈ కార్యక్రమాన్ని 21 డిసెంబర్, 2022న ప్రభుత్వం ప్రారంభించింది.

188. అధ్యక్షా.. ఈ పథకాన్ని మీ చేతుల మీదుగానే కామారెడ్డి జిల్లా కేంద్రంలో ప్రారంభించుకొన్నాం. ఈ సంవత్సరం నుంచి ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా 33 జిల్లాల్లో అమలు చేయాలని ముఖ్యమంత్రి గారు నిర్ణయించారని ఈ సభ ద్వారా తెలియజేయడానికి సంతోషిస్తున్నాను. ఈ నిర్ణయం ద్వారా దాదాపు 4 లక్షల మంది గర్భిణీలు ప్రతిఏటా లబ్దిపొందుతారు.

ఈ పథకం కోసం బడ్జెట్ లో 200 కోట్లు ప్రతిపాదించడమైనది.

**పాలియేటివ్ కేర్**

189. మానవతకు మారుపేరైన సీఎం కేసీఆర్ గారి ఆలోచన మేరకు క్యాన్సర్, ఎయిడ్స్ వంటి వ్యాధులతో అవసాన దశకు చేరిన పేషంట్ల కోసం ప్రభుత్వం పాలియేటివ్ కేర్ చేపట్టింది. వారి ఆరోగ్య పరిస్థితులను పర్యవేక్షిస్తూ, చివరి రోజులను ప్రశాంతంగా గడిపేందుకు ఈ కేంద్రాలు సేవలందిస్తాయి. ఇప్పటివరకు 33 కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. దేశవ్యాప్తంగా ఇలాంటి కేంద్రాలు మొత్తం 168 ఉండగా వాటిలో ఐదో వంతు తెలంగాణలోనే ఉన్నాయి.

వైద్య, ఆరోగ్య రంగానికి ఈ బడ్జెట్లో రూ.12,161 కోట్లు ప్రతిపాదించడమైనది.

**పల్లె ప్రగతి**

190. గ్రామీణాభివృద్ధి కోసం చిత్తశుద్ధితో పనిచేస్తున్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పక్షాన స్థానిక సంస్థలకు మరో శుభవార్తను తెలియజేస్తున్నాను. ఈ ఆర్థిక సంవత్సరం నుంచి రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసే పట్టణ ప్రగతి, పల్లె ప్రగతి నిధులతోపాటు, ఫైనాన్స్ కమిషన్ నిధులను కూడా స్థానిక సంస్థల ఖాతాల్లోకి నేరుగా బదిలీ చేయాలని ముఖ్యమంత్రి గారు నిర్ణయించారు. ఈ సంస్కరణ వల్ల స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు ఫైనాన్స్, ట్రెజరీల ఆమోదం కోసం

వేచి చూడకుండా, స్వతంత్రంగా నిధులు వినియోగించుకునే అవకాశం కలుగుతుంది.

191. పల్లె ప్రగతితో ప్రభుత్వం గ్రామాలను సకల మౌలిక వసతులతో పరిశుభ్రతతో పచ్చదనంతో కళకళలాడేలా చేసింది. తెలంగాణలోని 12,769 పల్లెలు సాధించిన ప్రగతితో పోల్చితే దేశంలో ఏ రాష్ట్రం కూడా మన దరిదాపుల్లో లేదు.

192. గ్రామీణ పారిశుద్ధ్య నిర్వహణ కోసం ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు కావాల్సినసాధనాలన్నింటినీ సమకూర్చింది. 279 కోట్లతో ప్రతి ఊరికీ ఒక డంప్ యార్డును ఏర్పాటు చేసింది. ట్రాలీతో కూడిన ట్రాక్టర్ ను అందించింది. వీటిద్వారా పరిశుభ్రత పెరగడంతో ప్రజారోగ్యం మెరుగుపడింది. గ్రామాల్లో పచ్చదనాన్ని ప్రభుత్వం పెంచేందుకు నర్సరీలను ఏర్పాటు చేసింది. కోట్ల సంఖ్యలో పల్లెల్లో మొక్కలు నాటి వాటిని సంరక్షిస్తున్నది. ఇందుకోసం 710 కోట్లు ఇప్పటివరకు వెచ్చించింది.

193. రాష్ట్రంలోని అన్ని గ్రామాల్లో 238 కోట్లతో ఆహ్లాదకరమైన పల్లె ప్రకృతి వనాలను ఏర్పాటు చేసింది. మండలానికి 5 చొప్పున 2,725 బృహత్ పల్లె ప్రకృతి వనాలను ఏర్పాటు చేసింది. 9243 కిలోమీటర్ల మేర రహదారులకు ఇరువైపులా మొక్కలను నాటి సంరక్షిస్తున్నది.

మరణించినవారి అంత్యక్రియలు గౌరవప్రదంగా జరిగేందుకు 1330 కోట్లతో అన్నిగ్రామాల్లో వైకుంఠ ధామాలను నిర్మించింది.

194. 2022-23లో స్వచ్ఛభారత్ మిషన్ లో తెలంగాణ గ్రామాలు 13 జాతీయ అవార్డులు సాధించాయి. ఆ గ్రామ పంచాయతీల ప్రతినిధులు గౌరవ రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డులు అందుకున్నారు.

195. పల్లె ప్రగతి కార్యక్రమం ఇప్పటివరకు 5 విడతలు పూర్తి చేసుకొన్నది. పల్లె ప్రగతి ప్రారంభించిన నాటి నుంచి నేటి వరకు 10 వేల కోట్లకు పైగా నిధులను ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు అందజేసింది.

196. తెలంగాణ ఏర్పాటైన నాటి నుంచి ఇప్పటివరకు 4,209 కోట్లతో 8,160 కి.మీల రోడ్ల నిర్మాణం చేపట్టింది. వీటిలో 6,075 కి.మీల పంచాయతీరాజ్ రోడ్ల నిర్మాణం పూర్తయింది. మిగతా రోడ్ల పనులు వేగంగా జరుగుతున్నాయి.

197. దెబ్బతిన్న పంచాయతీరాజ్ పాత రోడ్ల మరమ్మతులు, నిర్వహణ కోసం బడ్జెట్లో 2 వేల కోట్లు ప్రతిపాదించడమైనది.

పంచాయతీరాజ్ శాఖకు బడ్జెట్ లో రూ.31,426 కోట్లు ప్రతిపాదించడమైంది.

**పట్టణ ప్రగతి**

198. రోజురోజుకూ పట్టణీకరణ పెరుగుతున్న నేపథ్యంలో ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతులను కల్పించడంపై తెలంగాణ ప్రభుత్వం విశేషంగా దృష్టి సారించింది. ప్రభుత్వ చర్యలతో పురపాలక సంఘాలు ఆర్థికంగా బలపడ్డాయి. పరిపాలనా సామర్థ్యాన్ని పెంచుకున్నాయి. పట్టణ ప్రగతి కింద రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీలకు, హైదరాబాద్ సహా ఇతర మున్సిపల్ కార్పొరేషన్ల కు ఇప్పటివరకు ప్రభుత్వం 3855 కోట్ల నిధులిచ్చింది. ఈ పథకం ద్వారా పట్టణాల్లో పారిశుద్ధ్యం, పచ్చదనం మరియు మెరుగైన పౌర సేవలు అందించడం జరుగుతున్నది.

199. ప్రభుత్వం అన్ని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో 144 సమీకృత వెజ్, నాన్ వెజ్ మార్కెట్ల నిర్మాణాన్ని 522 కోట్లతో చేపట్టింది. పనులు శరవేగంగా జరుగుతున్నాయి. స్మశానాలను ఆధునిక వసతులతో వైకుంఠ ధామాలుగా మార్చేందుకు ఇప్పటికే 346 కోట్లు కేటాయించడం జరిగింది. ఈ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి.

200. అర్బన్ మిషన్ భగీరథ కింద 141 మున్సిపాలిటీల్లో 6578 కోట్లతో ఇంటింటికీ సురక్షిత తాగునీటి జలాలను అందించే పథకాన్ని

చేపట్టి 103 మున్సిపాలిటీల్లో పనులు పూర్తి చేసి తాగు నీరు అందిస్తున్నది. మిగతా మున్సిపాలిటీల్లో పనులు తుది దశకు చేరుకున్నాయి.

**ఎస్సార్డీపీ**

201. రాజధాని నగరంలో మౌలిక వసతులను మెరుగు పరచడానికి ప్రభుత్వం పెద్ద ఎత్తున కార్యక్రమాలు చేపట్టింది. హైదరాబాద్ లో ట్రాఫిక్ సమస్యలను తగ్గించడం కోసం ఎస్సార్డీపీ కింద 42 కీలక రహదారులు, ఫ్లై ఓవర్లు, అండర్ పాస్ లు, ఆర్వోబీల అభివృద్ధి చేపట్టింది. అందులో 31 పూర్తి చేయటం జరిగింది. మిగతా 11 ఈ ఆర్థిక సంవత్సరంలో పూర్తిచేస్తాం.

202. 275 కోట్లతో 22 లింక్ రోడ్ల నిర్మాణాన్ని ప్రభుత్వం పూర్తి చేసింది. దీనివల్ల ప్రయాణ దూరం, ట్రాఫిక్ సమస్యలతోపాటు కాలుష్యం తగ్గింది.76.65 కోట్లతో చేపట్టిన 22 ఫుట్ ఓవర్ బ్రిడ్జిలలో 9 వంతెనలు పూర్తయ్యాయి. మిగతావాటి పనులు వేగంగా జరుగుతున్నాయి.

**విమానాశ్రయానికి మెట్రో కనెక్టివిటీ**

203. శంషాబాద్ లోని అంతర్జాతీయ విమానాశ్రయంలో ప్రయాణికుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతున్నది. విమానాశ్రయంలో సంవత్సరానికి 4 కోట్ల మంది ప్రయాణం చేసినా సరిపడే విధంగా విమానాశ్రయ

విస్తరణ పనులు 7500 కోట్లతో జరుగుతున్నాయి. ఈ కార్యక్రమం ఈ ఏడాది జూన్ లోపల పూర్తయి, ప్రయాణికులకు అందుబాటులోకి వస్తుంది.

204. రోజురోజుకూ పెరుగుతున్న విమాన ప్రయాణికుల రవాణా సౌకర్యం కోసం హైదరాబాద్ నలుమూలల నుంచి విమానాశ్రయానికి తొందరగా చేరుకోవడానికి మెట్రో రైలును ఎయిర్ పోర్ట్ కు అనుసంధానం చేస్తూ 'ఎయిర్ పోర్టు మెట్రో'కు రూపకల్పన చేసింది. ఈ మెట్రో మార్గం రాయదుర్గం మెట్రో స్టేషన్ నుంచి మొదలై శంషాబాద్ విమానాశ్రయం వరకు 31 కిలోమీటర్ల మేర విస్తరించనున్నది. ఇటీవలనే గౌరవ ముఖ్యమంత్రి గారు ఈ పథకానికి శంకుస్థాపన చేయడం జరిగింది. మొత్తం 6250 కోట్ల వ్యయంతో చేపట్టే ఈ ప్రాజెక్టు రాష్ట్ర ప్రభుత్వం తన సొంత నిధులతోనే వచ్చే మూడు సంవత్సరాల్లోనే పూర్తి చేయనున్నది.

**హైదరాబాద్ అభివృద్ధి**

205. తెలంగాణ ప్రభుత్వం హెచ్ఎం డీఏ పరిధిలో 387 కోట్లతో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టింది. హైదరాబాద్ లో హరితహారం పథకం కింద 63 లక్షల మొక్కలు నాటడం జరిగింది. కోకాపేట లే అవుట్ లో పైలట్ ప్రాజెక్టుగా చేపట్టిన సోలార్ రూఫ్ సైకిల్ ట్రాక్ ఒక ట్రెండ్ సెట్టర్

గా నిలవబోతున్నది. మొత్తం 23 కిలోమీటర్ల స్ట్రెచ్ ను 95 కోట్లతో అభివృద్ధి చేయడం జరుగుతున్నది.

206. ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలో ఉన్న జనాభాకు తాగునీటి సరఫరా చేసే ప్రాజెక్టు పనులు హైదరాబాద్ మెట్రో వాటర్ సంస్థ 1956 కోట్లతో చేపట్టింది.

207. హైదరాబాద్ మహానగరంలో నిరంతర తాగునీటి సరఫరాకోసం 2214 కోట్లతో చేపట్టిన సుంకిశాల ఇన్ టేక్ వెల్ పనులు ఈ ఆర్థిక సంవత్సరంలో పూర్తవుతాయి.

208. హైదరాబాద్ మహానగరంలో మురుగు నీటి నిర్వహణ కోసం ప్రభుత్వం సీవరేజ్ మాస్టర్ ప్లాన్ అమలుచేస్తున్నది. తొలి దశలో ఎస్ టీపీల నిర్మాణానికి అనుమతులు మంజూరు చేయడమైనది. మూడు ప్యాకేజీల్లో భాగంగా 31 ఎస్టీపీలు, 1259 ఎంఎల్డీల సామర్థ్యంతో 3866 కోట్ల వ్యయంతో చేపట్టింది.

209. జీహెచ్ఎంసీ పరిధిలో 67,782 డబుల్ బెడ్ రూం ఇండ్ల నిర్మాణం ఇప్పటికే పూర్తయింది. 32,218 ఇండ్ల నిర్మాణం వివిధ దశల్లో ఉన్నది.

210. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన స్వచ్ఛ సర్వేక్షణ్, ఆజాదీకా అమృత్ మహోత్సవ్ లలో వివిధ క్యాటగిరీలలో తెలంగాణ పట్టణాలకు 23 అవార్డులు లభించాయి. అదేవిధంగా కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ..

దేశంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాలకు ఇచ్చే అవార్డుల్లో 7 అవార్డులు తెలంగాణ మున్సిపాలిటీలకు వచ్చాయి.

211. జాతీయ స్థాయి స్వచ్ఛత లీగ్ లో కోరుట్ల, ఆలంపూర్, పీర్జాదిగూడ అవార్డులు గెలుచుకొన్నాయి. దేశంలో పట్టణాభివృద్ధిలో అవార్డులు అందుకొన్న రాష్ట్రాల్లో తెలంగాణ రెండోస్థానంలో నిలిచింది. ఇది రాష్ట్ర ప్రభుత్వ ప్రగతిశీల విధానాలకు నిదర్శనం. అవార్డులు సాధించిన అధికారులకు, పాలకవర్గాలకు అభినందనలు.

పురపాలక శాఖకు ఈ బడ్జెట్ లో రూ.11,372 కోట్లు ప్రతిపాదించడమైనది.

**దివ్యక్షేత్రం యాదాద్రి**

212. తెలంగాణ అవతరణ తరువాత ముఖ్యమంత్రి కేసీఆర్ గారి పరిపాలనలో, మన కండ్లముందు ఆవిష్కృతమైన మరో అద్భుతం యాదగిరి లక్ష్మీ నరసింహస్వామి దేవాలయం పునర్నిర్మాణం. పంచనారసింహ క్షేత్రాల్లో ఒకటైన యాదగిరి తెలంగాణ ప్రజల కోరిన కోర్కెలు తీర్చే కొంగుబంగారమైన క్షేత్రం. యాదగిరి నరసన్న ఇంటింటి ఇలవేల్పు.

213. సనాతన ధర్మ పరిరక్షణ అనేది ఒక రాజకీయ నినాదంగా కాకుండా నిత్యమైన సత్యమైన ఆచరణ విధానంగా భావించిన గౌరవ

ముఖ్యమంత్రి కేసీఆర్ గారు ప్రత్యేక శ్రద్ధా భక్తులతో యాదగిరి దివ్య క్షేత్రాన్ని భూలోక వైకుంఠంగా తీర్చిదిద్దారు. సప్తతల గోపురాలతో.. కృష్ణ శిలా శిల్పాలతో ఆధ్యాత్మిక దివ్యత్వం ఉట్టిపడే విధంగా నిర్మించిన యాదగిరి దేవాలయం భక్తులకు కనువిందు చేస్తున్నది.

214. 2022లో జరిపిన మహాకుంభ సంప్రోక్షణం అనంతరం స్వామివారు భక్తులకు దివ్యదర్శనం ఇస్తున్నారు. యాదగిరి దేవాలయాన్ని సందర్శించే భక్తుల సంఖ్య ఇబ్బడిముబ్బడిగా పెరిగిపోయింది. తెలంగాణ ఆధ్యాత్మిక ఔన్నత్యానికి ప్రతీకగా యాదగిరి దేవాలయాన్ని పునర్నిర్మింపజేసిన ముఖ్యమంత్రి గారు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతారనడంలో సందేహం లేదు.

**ప్రతిష్ఠాత్మకంగా బుద్ధవనం నిర్మాణం**

215. ప్రాచీన కాలం నుంచీ తెలంగాణ బౌద్ధ, జైన మతాలకు కేంద్రంగా విలసిల్లింది. ఆచార్య నాగార్జునుడు నడయాడిన నాగార్జునసాగర్ లో తెలంగాణ ప్రభుత్వం బుద్ధ వనాన్ని అద్భుతంగా నిర్మించింది. 274 ఎకరాల విస్తీర్ణంలో బుద్ధవనం ప్రాజెక్టును 71 కోట్లతో ప్రభుత్వం అభివృద్ధి చేసింది. అనేక ఆకర్షణలతో ప్రత్యేకతలను సంతరించుకొన్న ఈ ప్రాజెక్టు.. జాతీయ అంతర్జాతీయ స్థాయిలో బౌద్ధులను, ఇతర పర్యాటకులను పెద్దఎత్తున ఆకర్షిస్తున్నది.

**రోడ్లు భవనాలు**

216. తెలంగాణ ఏర్పడేనాటికి రాష్ట్రంలో రహదారులు, భవనాల శాఖ పరిధిలో 24,245 కిలోమీటర్ల రోడ్లు మాత్రమే ఉండేవి. రాష్ట్రం ఏర్పడిన తరువాత 2,727 కోట్లతో 1875 కిలోమీటర్ల మేర డబుల్ రోడ్ల నిర్మాణాన్ని కొత్తగా చేపట్టింది. వీటిలో 1684 కిలోమీటర్ల రోడ్లు పూర్తయ్యాయి. 3134 కోట్ల ఖర్చుతో 717 వంతెనల నిర్మాణం చేపట్టగా.. వాటిలో 350 వంతెనల నిర్మాణం పూర్తయింది.

217. రాష్ట్ర ప్రభుత్వం 29 జిల్లాల్లో 1581 కోట్లతో సమీకృత కలెక్టరేట్ల నిర్మాణం చేపట్టింది. వీటిలో 17 భవనాలను ఇప్పటికే ప్రారంభించుకున్నాం. మరో 11 కలెక్టరేట్ల పనులు తుది దశలో ఉన్నాయి. తెలంగాణ ప్రభుత్వం నిర్మించిన కలెక్టరేట్ భవనాలు కొన్నిరాష్ట్రాల సచివాలయ భవనాలకన్నా మిన్నగా ఉన్నాయని పలువురు ప్రముఖులు ప్రశంసించారు.

218. తెలంగాణ అస్తిత్వాన్ని సమున్నతంగా చాటే విధంగా నిర్మితమైన సెక్రటేరియట్ భవనానికి ప్రభుత్వం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పేరును పెట్టడంతో దేశవ్యాప్తంగా ప్రశంసల జల్లు కురిసింది. అధునాతన వసతులతో  7 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంతో 7 అంతస్తుల సచివాలయ భవనం నిర్మాణం పూర్తయింది. ఈ సచివాలయాన్ని

ఫిబ్రవరి 17న ముఖ్యమంత్రి కేసీఆర్ గారి చేతుల మీదుగా ప్రారంభించుకోబోతున్నాం. రాష్ట్రానికే గర్వకారణమైన సెక్రటేరియట్ భవనాన్ని కాలంతో పోటీ పడుతూ వేగంగా నిర్మింపజేసిన అధికారులకు, ఇంజినీర్లకు, కార్మికులకు అభినందనలు.

219. సచివాలయ సమీపంలో సమున్నతంగా 125 అడుగుల అంబేద్కర్ విగ్రహాన్ని 147 కోట్లతో ప్రభుత్వం నిర్మిస్తున్నది. సామాజిక న్యాయ స్ఫూర్తికి సమున్నత ప్రతీకగా నిర్మిస్తున్న అంబేద్కర్ మహనీయుని విగ్రహం యావద్దేశానికి గర్వకారణంగా నిలవబోతున్నది. ఈ ఏడాది మార్చి నాటికి విగ్రహం పనులను పూర్తి చేసేందుకు ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉన్నది.

220. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణ త్యాగం చేసిన అమరుల స్మృతిలో ప్రభుత్వం 178 కోట్ల వ్యయంతో ప్రతిష్ఠాత్మకంగా స్మారక కేంద్రాన్ని నిర్మించింది. ఈ కేంద్రం ప్రారంభానికి సిద్ధంగా ఉన్నది.

221. ఈ సంవత్సరం రాష్ట్రంలో రోడ్లు భవనాల శాఖ ద్వారా రహదారుల నిర్వహణ మరమ్మతుల కోసం బడ్జెట్ లో 2 వేల 500 కోట్లు ప్రతిపాదించడమైనది.

**పరిపాలనా సంస్కరణలు**

222. పరిపాలనా వ్యవస్థ అత్యంత పారదర్శకంగా ప్రజలకు చేరువగా ఉండాలని గౌరవ ముఖ్యమంత్రి కేసీఆర్ గారు ఆకాంక్షించారు. పరిపాలనా సౌలభ్యం కోసం పది జిల్లాలుగా ఉన్న తెలంగాణను 33 జిల్లాలుగా పునర్వ్యవస్థీకరించారు.

223. రాష్ట్రంలో కొత్తగా 153 మండలాలు, 35 రెవెన్యూ డివిజన్లు, .. 8 మున్సిపల్ కార్పొరేషన్లు, 87 కొత్త మున్సిపాలిటీలు, 4,914 గ్రామ పంచాయతీలను కొత్తగా ఏర్పాటు చేసుకొన్నాం. దీనివల్ల పరిపాలన ప్రజలకు అత్యంత సమీపానికి వచ్చింది.

224. పని భారానికి తగినట్టుగా రోడ్లు భవనాల శాఖలో అదనపు సిబ్బందిని మంజూరుచేసి ఆ శాఖను సంపూర్ణంగా పునర్వ్యవస్థీకరించడం జరిగింది.

225. రెవెన్యూ శాఖలో ధరణి ద్వారా సమూలమైన మార్పులు చేపట్టడం వలన రాష్ట్రంలో భూ వివాదాలను కనీసస్థాయికి తీసుకొని రావడం జరిగింది. రెవెన్యూశాఖతో కొత్త రిజిస్ట్రేషన్ వ్యవస్థను అనుసంధానం చేయడం వల్ల పారదర్శకత పెరిగి అవినీతికి అడ్డుకట్ట పడింది.

**పరిశ్రమలు, ఐటీ రంగం**

226. తెలంగాణ రాష్ట్రం జాతీయ, అంతర్జాతీయ పెట్టుబడులకు స్వర్గధామంగా మారింది. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన టీఎస్ ఐపాస్ చట్టం విప్లవాత్మకమైన మార్పులను తీసుకొచ్చింది. పరిశ్రమల స్థాపనకు సంబంధించిన అనుమతుల ప్రక్రియ అత్యంత సులభతరంగా మారింది. 24 గంటల విద్యుత్తు, మెరుగైన శాంతిభద్రతలు, స్థిరమైన, సమర్థవంతమైన పరిపాలన నెలకొన్నందున జాతీయ అంతర్జాతీయ స్థాయి దిగ్గజ సంస్థలు తెలంగాణకు తరలివస్తున్నాయి. టీఎస్ ఐపాస్ ద్వారా ఇప్పటివరకు 22,110 పరిశ్రమలకు అనుమతులు లభించాయి. గత ఎనిమిదిన్నరేండ్లుగా IT మరియు ఇతర పారిశ్రామిక రంగాలలో 3 లక్షల 31 వేల కోట్ల కు (40 బిలియన్ USD) పైగా పెట్టుబడులను ఆకర్షించింది. 22 లక్షల 36 వేల ఉద్యోగ అవకాశాలు కలిగాయి.

227. ఆక్స్ ఫర్డ్ ఎకనామిక్స్ అనే సంస్థ వెల్లడించిన నివేదిక ప్రకారం ఆఫీస్ స్పేస్ వినియోగంలో హైదరాబాద్ రికార్డు సృష్టించింది. తెలంగాణ ఆవిర్భవించిన నాటి నుంచి ఎనిమిదిన్నరేండ్లలో ఐటీ వార్షిక ఎగుమతుల విలువ 57,258 కోట్ల నుంచి లక్షా 83 వేల 569 కోట్లకు పెరిగింది. అంటే 220 శాతం వృద్ధిని తెలంగాణ నమోదు చేసింది.

228. ఐటీ ఉద్యోగాల నియామకాల్లో కూడా 156 శాతం వృద్ధి ఉండటం విశేషం. 2014 నాటికి తెలంగాణలో 3,23,396 మంది ఐటీ ఉద్యోగాల్లో ఉండగా ఇప్పుడు వీరి సంఖ్య 8,27,124 కి పెరిగింది. దేశవ్యాప్తంగా 2021-22 లో 4.50 లక్షల ఐటీ ఉద్యోగాలు రాగా అందులో ఒక్క తెలంగాణలోనే 1,49,506 ఉద్యోగాలు సృష్టించబడ్డాయి.

229. ఐటీ ఎగుమతుల్లో 2021-22 సంవత్సరానికి గాను 26.14 శాతం వృద్ధితో తెలంగాణ దేశంలోనే నంబర్ వన్ స్థానానికి చేరుకున్నది.

230. ప్రపంచంలోనే టాప్ 5 టెక్నాలజీ కంపెనీలైన యాపిల్, గూగుల్, అమెజాన్, మైక్రోసాఫ్ట్, ఫేస్ బుక్ సంస్థలు తమ కేంద్ర కార్యాలయాలకు వెలుపల అతి పెద్ద ఆఫీసులను హైదరాబాద్ లోనే నెలకొల్పటం విశేషం. ఇందులో 4 తెలంగాణ ఆవిర్భావం తరువాత వచ్చినవే.

231. ఐటీరంగాన్ని ద్వితీయ శ్రేణి నగరాలకూ విస్తరించాలనే లక్ష్యంతో ప్రభుత్వం వరంగల్, కరీంనగర్, ఖమ్మంలలో ఐటీ టవర్లను నిర్మించింది. నిజామాబాద్, మహబూబ్ నగర్, నల్లగొండ మరియు సిద్దిపేటలో ఐటీ టవర్లు నిర్మాణంలో ఉన్నాయి. వీటిని ఈ ఆర్థిక సంవత్సరంలో ప్రారంభించుకుంటాం.

232. ఇటీవల దావోస్ లో జరిగిన వరల్డ్ ఎకనామిక్ ఫోరం సదస్సులో తెలంగాణకు పెద్ద ఎత్తున పెట్టుబడులు వచ్చాయి. మొత్తం 21 వేల కోట్ల పెట్టుబడులు తెలంగాణకు రావడం గర్వించదగ్గ విషయం. రాష్ట్రానికి ఇంత భారీ స్థాయిలో పెట్టుబడులు వచ్చేందుకు కృషి చేసిన పరిశ్రమల శాఖకు అభినందనలు.

233. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుకోవడం కోసం విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి వారిని ఉద్యోగాలకు సిద్ధం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ అకాడమీ ఆఫ్ స్కిల్స్ అండ్ నాలెడ్జి కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. దీనిలో ఇప్పటివరకు 7,09,530 మందికి శిక్షణ ఇవ్వటం జరిగింది.

**టీ హబ్**

234. వినూత్న ఆవిష్కరణలతో ముందుకు వచ్చే ఔత్సాహిక యువ పారిశ్రామిక వేత్తలను ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నది. వారి ఆలోచనలను ఆవిష్కరణలుగా మలచుకొనేందుకు, సామాజికంగా ఉపయోగపడే ఉత్పత్తుల రూపకల్పనకు టీహబ్, వీహబ్, టీ వర్క్స్, రీచ్ సంస్థల ద్వారా అండదండలు అందిస్తున్నది. వినూత్న స్టార్టప్ ల ఆవిష్కరణల్లో దేశంలోనే రికార్డు సృష్టించిన టీ హబ్.. మరింత విస్తరించింది. ‘టీహబ్ 2.ఓ’ ను ముఖ్యమంత్రి గారి చేతులమీదుగా ప్రారంభించుకోవడం

జరిగింది. భారత ప్రభుత్వం నిర్వహించిన నేషనల్ స్టార్టప్ అవార్డ్స్ 2022 లో T-Hub దేశం లోనే "ఉత్తమ ఇంక్యుబేటర్" గా నిలిచింది.

235. తెలంగాణలో ఫార్మాసిటీ, నిమ్జ్, కాకతీయ మెగాటెక్స్ టైల్స్, ఎలక్ట్రానిక్ ఉత్పత్తి క్లస్టర్లు వంటి అనేక భారీ పారిశ్రామిక వాడల్లో పనులు వేగంగా జరుగుతున్నాయి. వచ్చే ఐదేండ్లలో 70 కొత్త పారిశ్రామిక వాడలను టీఎస్ఐఐసీ ద్వారా ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకొన్నది.

236. సూక్ష్మ, మధ్యతరగతి పరిశ్రమలకు సంబంధించి దండుమల్కాపూర్ లో గ్రీన్ ఇండస్ట్రియల్ పార్కును 570 ఎకరాల్లో ఏర్పాటు చేయడం జరిగింది. 400 ఎంఎస్ఎంఈలు 1200 కోట్ల పెట్టుబడులు పెట్టాయి. ఈ పరిశ్రమల్లో 15 వేల మందికి ఉపాధి లభించింది.

237. ఆహార పరిశ్రమలను ప్రోత్సహించడానికి హైదరాబాద్ మినహా 9 ఉమ్మడి జిల్లాల్లో 7,150 ఎకరాల విస్తీర్ణం లో 21 కొత్త స్పెషల్ ఫుడ్ ప్రాసెసింగ్ జోన్‌లు ఏర్పాటుచేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ జోన్లకు అవసరమైన అప్రోచ్ రోడ్లు, అంతర్గత రోడ్లు, విద్యుత్తు, నీటి సౌకర్యాలతో పాటు గోదాములు, కోల్డ్ స్టోరేజీలను ఏర్పాటు చేస్తుంది.

పరిశ్రమల శాఖకు ఈ బడ్జెట్లో రూ.4,037 కోట్లు ప్రతిపాదించడమైనది.

**పటిష్టంగా శాంతి భద్రతలు**

238. శాంతి భద్రతల నిర్వహణ సమర్థవంతంగా జరిగితేనే సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుంది.  దేశంలో ఎక్కడా లేనివిధంగా ఇవాళ రాష్ట్రానికి పెట్టుబడులు వస్తున్నాయంటే.. రాష్ట్రంలో మెరుగైన శాంతిభద్రతల నిర్వహణ ఒక కారణం.

239. ఇప్పటివరకు ప్రభుత్వం కొత్తగా 31,198 పోలీసు ఉద్యోగాల కల్పన చేసింది. మెగాసిటీ పోలీసింగ్ లో భాగంగా హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్లను మరింత బలోపేతం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మూడు కమిషనరేట్ల పరిధిలో 56 లా అండ్ ఆర్డర్, 19 ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లు, 4 ట్రాఫిక్ ఏసిపి పోలీస్ డివిజన్లు, 2 ట్రాఫిక్ డిసిపి జోన్లను ఏర్పాటుచేయటం జరిగింది. రాష్ట్రస్థాయిలో తెలంగాణ నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో, సైబర్ సేఫ్టీ బ్యూరోలను మరియు కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ ను ఏర్పాటుచేసింది.

240. రాష్ట్రంలో నిఘా వ్యవస్థను పటిష్ఠం చేయడం కోసం ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా 9.8 లక్షల సీసీ కెమెరాలను ఏర్పాటుచేసింది. దేశంలో ఇంత పెద్ద సంఖ్యలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసిన ఒకే ఒక్క రాష్ట్రంగా తెలంగాణ రికార్డు సృష్టించింది.

241. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన సమీకృత కమాండ్ అండ్ కంట్రోల్ భవనాన్ని 2022 ఆగస్టు 4 వ తేదీన గౌరవ ముఖ్యమంత్రి గారి చేతులమీదుగా ప్రారంభించుకోవడం జరిగింది. రాష్ట్ర వ్యాప్తంగా 24 గంటలు నిఘాతో పాటు, అత్యవసర పరిస్థితులు, ఇతర విపత్కర సందర్భాల్లో వివిధ శాఖలను అనుసంధానం చేసి విపత్తు నిర్వహణ సమర్థంగా చేసే హబ్ గా కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ పనిచేస్తుంది.

242. రాష్ట్ర పోలీసులు.. జాతీయ అంతర్జాతీయ స్థాయిల్లో అనేక అవార్డులు అందుకొన్నారు. తెలంగాణ పోలీసింగ్ అనేక రాష్ట్రాల పోలీసులకు రోల్ మోడల్ గా మారింది.

243. రాష్ట్రంలో విపత్తుల సహాయ నిర్వహణను సమర్థంగా జరపడం కోసం 2022లో కొత్తగా 18 ఫైర్ స్టేషన్లను ప్రభుత్వం ఏర్పాటుచేసింది. దీంతో రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో ఫైర్ స్టేషన్ల ఏర్పాటు పూర్తయింది. ఫైర్ లైసెన్సులన్నీ ఆన్ లైన్ ద్వారానే ఇచ్చేలా వెబ్ పోర్టల్ ఏర్పాటుచేసింది.

ఈ సంవత్సరం బడ్జెట్లో హోమ్ శాఖకు రూ.9,599 కోట్లు ప్రతిపాదించడమైనది

**ఉద్యోగుల సంక్షేమం**

244. రాష్ట్ర అభివృద్ధిలో ఉద్యోగులది కీలకమైన భాగస్వామ్యం. పలు విభాగాలను పరిశీలిస్తే తెలంగాణ ఉద్యోగులు దేశంలోకెల్లా అత్యధిక వేతనాలు పొందుతున్నారని సగర్వంగా తెలియజేస్తున్నాను. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల కన్నా, ఇతర రాష్ట్రాల ఉద్యోగుల కన్నా మన ఉద్యోగులు మెరుగైన జీతభత్యాలు పొందుతున్నారు. ప్రభుత్వ ఉద్యోగులతో పాటు సమానంగా అంగన్ వాడీ, ఆశా, ఇంకా ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఫిట్ మెంట్ ఇవ్వటం, దానిని ఏకకాలంలో వర్తింపచేయటం దేశంలోనే ప్రథమం.

245. కేంద్ర ప్రభుత్వం నిధులలో కోతలు పెడుతూ, అనేక ఆర్థిక ఆంక్షలు పెడుతున్నప్పటికీ, రాష్ట్రంలో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల కోసం పెద్ద ఎత్తున ఆర్థిక అవసరాలు ఉన్నప్పటికీ.. తెలంగాణ ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయుల ప్రయోజనాల విషయంలో ఏనాడూ తక్కువ చేయలేదు.

246. ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల విజ్ఞప్తుల మేరకు కొత్త ఈహెచ్ ఎస్ విధానాన్ని ఈ ఆర్థిక సంవత్సరంలో తీసుకురావాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఎంప్లాయీస్ హెల్త్ కేర్ ట్రస్ట్ ను ఏర్పాటు చేసి ఇందులో ప్రభుత్వ ప్రతినిధులతో పాటు ఉద్యోగ, ఉపాధ్యాయులు, రిటైర్డ్ ఉద్యోగుల

ప్రతినిధులను భాగస్వాములుగా చేస్తుంది. దీనికి సంబంధించిన విధి విధానాలను ప్రభుత్వం త్వరలోనే ప్రకటిస్తుంది.

**భారీగా ఉద్యోగ నియామకాలు**

247. లోకల్ కేడర్ల ఏర్పాటు మరియు ప్రభుత్వ ఉద్యోగాల నియామకాల్లో స్థానిక అభ్యర్థులకు రిజర్వేషన్ల వ్యవస్థ రాజ్యాంగంలోని 371 (డీ) ఆర్టికల్ కింద రాష్ట్రపతి ఉత్తర్వుల (PO) ప్రకారం ఉంటుంది. గౌరవ ముఖ్యమంత్రిగారు పట్టుదల వహించి కొత్త రాష్ట్రపతి ఉత్తర్వులను తెలంగాణ కోసం ప్రత్యేకంగా సాధించారు. ఈ ఉత్తర్వుల ద్వారా తెలంగాణలో 33 జిల్లాలు, 7 జోన్లు, రెండు మల్టీ జోన్లుగా ఉద్యోగ నియామకాల కోసం ఏర్పాటు చేసుకున్నాం.

248. గతంలో స్థానికులకు 60 నుంచి 80 శాతం వరకు మాత్రమే లోకల్ రిజర్వేషన్లు ఉండేది. ఇప్పుడు అమలు చేస్తున్న నూతన నియామక విధానంతో అటెండర్ నుంచి ఆర్డీవో దాకా స్థానికులకే 95 శాతం ఉద్యోగాలు లభిస్తాయి. కొత్త నియామకాలు ఈ పద్ధతిలోనే జరుగుతున్నాయి. ఇది తెలంగాణ ప్రభుత్వం సాధించిన చారిత్రాత్మక విజయం.

249. 2014 జూన్ నుంచి ఫిబ్రవరి 2022 దాకా ప్రత్యక్ష నియామక విధానం ద్వారా 1,61,572 ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వం అనుమతి

ఇచ్చింది. వీటిలో 1,41,735 పోస్టుల ఎంపిక ప్రక్రియ పూర్తయింది. వీటితో పాటు కొత్తగా 2022 మార్చి నెలలో గౌరవ ముఖ్యమంత్రి కేసీఆర్ గారు 80,039 పోస్టులను వివిధ క్యాటగిరీలలో భర్తీ చేస్తామని ప్రకటించారు. వీటి భర్తీ ప్రక్రియ చురుగ్గా కొనసాగుతోంది. కొత్తగా నియమించబడే ఉద్యోగుల జీతభత్యాల కోసం ఈ బడ్జెట్లో వెయ్యి కోట్లు అదనంగా ప్రతిపాదించడమైనది.

250. ఇచ్చిన మాట ప్రకారం ఏప్రిల్ నెల నుంచి కాంట్రాక్టు ఉద్యోగుల సర్వీసుల క్రమబద్ధీకరణ మరియు సెర్ఫ్ ఉద్యోగుల పేస్కేల్ సవరణ చేయబోతున్నాం.

## ముగింపు

251. ముఖ్యమంత్రి కేసీఆర్ గారు ఏ పథకాన్ని ప్రవేశపెట్టినా ప్రజల అవసరాలే ప్రమాణంగా భావిస్తారు. అంతే తప్ప ఎన్నికల ప్రయోజనాల కోసం చేయరు. ఎన్నికల మానిఫెస్టోలో పేర్కొన్న అంశాలను అమలు చేస్తూనే.. పేర్కొనకుండానే ఎన్నో పథకాలను మానవీయ కోణంలో ఆలోచించి అమల్లోకి తెచ్చారు. దళితబంధు, రైతుబంధు, రైతు బీమా, కంటి వెలుగు, కేసీఆర్ కిట్, న్యూట్రిషన్ కిట్, అమ్మ ఒడి, కల్యాణ లక్ష్మి.. షాదీముబారక్, బీడీ కార్మికులకు, ఒంటరి మహిళలకు,

బోదకాలు బాధితులకు, డయాలిసిస్ పేషంట్లకు ఆసరా పింఛన్లు.., రైతు వేదికలు, నీటి తీరువా రద్దు, గొల్ల కుర్మలకు గొర్రెల పంపిణీ, మత్స్యకారుల కోసం చేప పిల్లల పంపిణీ, గీత కార్మికులకు చెట్ల పన్ను రద్దు, నేతన్నకు బీమా పథకాలు కానీ, అదేవిధంగా గీత కార్మికులతోపాటు వాహన డ్రైవర్లు, భవన నిర్మాణ కార్మికులు, మత్స్యకారులు, జర్నలిస్టులు, హోం గార్డులు తదితర వర్గాల వారికి 5 లక్షల ప్రమాద బీమా కానీ, ప్రభుత్వ భూముల్లో ఇళ్లు నిర్మించుకున్న పేదలకు ఉచితంగా పట్టాలు, సామాజిక వర్గాల వారికి ఆత్మగౌరవ భవనాల నిర్మాణం కానీ, అంగన్ వాడీ, ఆశా, హోంగార్డులు తదితరులకు ఇచ్చే పారితోషికాల పెంపుదల కానీ, విద్యార్థులకు సన్నబియ్యంతో అన్నం, జిల్లాకో మెడికల్ కాలేజీ,.. ఇట్లా చెప్పుకుంటూ పోతే.. అనేక అంశాలు ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అమలు చేసిన ఘనత గౌరవ ముఖ్యమంత్రి కేసీఆర్ గారిది, బీఆర్ఎస్ ప్రభుత్వానిది.

252. అనేక సవాళ్లు, అవరోధాల నడుమ తెలంగాణ ప్రగతి ప్రస్థానం స్ఫూర్తిదాయకంగా కొనసాగుతున్నది. ఎనిమిదిన్నరేండ్ల తక్కువ వ్యవధిలోనే అనేక విజయాలను సాధించింది. దేశం అబ్బురపడే అద్భుతాలను ఆవిష్కరించింది. నాడు తెలంగాణ ఉద్యమాన్ని ముందుండి నడిపించి, నేడు స్వరాష్ట్ర ప్రగతి యాత్రకు సారథ్యాన్ని

వహిస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్ గారు తమ దార్శనికతతో, మేధాశక్తితో, సృజనాత్మకతతో, పరిపాలనా పటిమతో మనందరిలో నిరంతరం ఉత్సాహాన్ని నింపుతున్నారు. ముందుకు నడిపిస్తున్నారు.

253. ఎనిమిదిన్నరేండ్ల తెలంగాణ.. అభివృద్ధిలో దేశం ముందు అపూర్వమైన ఆదర్శాన్ని నిలబెట్టింది. సంక్షేమంలో స్వర్ణయుగాన్ని సృష్టించింది. అభివృద్ధికి మానవీయ కోణాన్ని అద్దింది. ముఖ్యమంత్రి కేసీఆర్ గారు ఆవిష్కరించిన ఎన్నో పథకాలకు జాతీయ, అంతర్జాతీయ ఖ్యాతి లభించింది. నేడు ఇతర రాష్ట్రాల ప్రజలు కూడా తెలంగాణ తరహా అభివృద్ధిని కోరుకుంటున్నారు. తెలంగాణ అభివృద్ధి నమూనాకు దేశం మొత్తం జేజేలు పలుకుతున్నది.

254. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంపై కక్షనూ, వివక్షనూ ప్రదర్శిస్తున్నా, అనేక ఆర్థిక ఆంక్షలు విధిస్తున్నా సంక్షేమం, అభివృద్ధిలో ఏనాడూ కొరత రానివ్వకుండా తెలంగాణ ప్రభుత్వం ప్రజా ప్రయోజనాలను కాపాడుతున్నది.

255. దేశంలో ప్రతీఘాతుక శక్తులు సామాజిక సామరస్యాన్ని దెబ్బతీసేందుకు ప్రయత్నిస్తున్న సందర్భంలో తెలంగాణ గంగా జమునా తెహజీబ్ ను పరిరక్షిస్తూ శాంతి, సామరస్యాలను కంటికి

రెప్పలా కాపాడుతున్నది. ఎవరెన్ని కుట్రలు చేసినా మా మనోబలం గానీ, మాకున్న ప్రజాబలం గానీ చెక్కు చెదరదు.

256. అయితే సాధించిన దానికి సంతృప్తిని చెంది అక్కడే ఆగిపోవడం కార్యశూరుల లక్షణం కాదు. సరికొత్త లక్ష్యాలను నిర్దేశించుకుంటూ ముందడుగు వేయడమే మన ముఖ్యమంత్రి గారి నైజం. వారు ఆశించిన లక్ష్యాలను పూర్తి చేసేందుకు తెలంగాణ ప్రజల ఆశీర్వాద బలంతో మరింత పట్టుదలతో ముందుకు సాగుదాం.

257. రానున్న రోజుల్లోనూ జాతి నిర్మాణంలో తెలంగాణ మరింత ఉజ్వల పాత్రను నిర్వహించే విధంగా పురోగమిస్తుంది. దళితులు, గిరిజనులు, మైనారిటీలు, బడుగు, బలహీన వర్గాల ప్రజలు, అగ్రవర్ణ పేదలు అందరి జీవితాల్లో సంపూర్ణమైన వికాసాన్ని సాధించేంత వరకూ విశ్రాంతీ, విరామం ఎరుగక పరిశ్రమిస్తూనే ఉందాం. ప్రగతి ప్రస్థానాన్ని కొనసాగిస్తూనే ఉందాం. ఇందుకోసం రాజీలేని మార్గాన్ని అనుసరిస్తామనీ, ఈ మహా సంకల్పానికి సంపూర్ణమైన అండదండలు అందించాలని తెలంగాణ ప్రజానీకాన్ని సవినయంగా కోరుతున్నాను.

**2023-24 బడ్జెట్ అంచనాలు..**

258. 2023-24 ఆర్థిక సంవత్సరానికి మొత్తం వ్యయం 2,90,396 కోట్లు, రెవెన్యూ వ్యయం 2,11,685 కోట్లు, మూలధన వ్యయం 37,525 కోట్లుగా ప్రతిపాదిస్తున్నాను.

259. 2023-24 సంవత్సరానికి బడ్జెట్ ప్రతిపాదనలు సభ ఆమోదం కోసం ప్రవేశ పెడుతున్నాను.

**జై తెలంగాణ.. జై హింద్..**